పేజీలు :12
వెల :5/-

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

# మీడియా టుడే

CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 సంచిక : 148 CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) శనివారం 29-8-2026 పేజీలు 12 వెల 5/-

# రక్షాబంధన్..!

**సీఎం రేవంత్‌కు బంగారు రాఖీ కట్టిన మంత్రి సురేఖ**

**మంత్రి సీతక్కతో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన కొండా**

**ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రికి మరింత శక్తి, యుక్తి కలగాలి: కొండా సురేఖ**


**రాఖీ వేరు.. రచ్చ వేరు**



**హైదరాబాద్, ఆగస్టు 28 : మీడియా టుడే**
రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఉద్వాసన ఖాయమన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఆమె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. మరో మంత్రి సీతక్కతో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన మంత్రి సురేఖ.. బంగారంతో ప్రత్యేకంగా చేయించిన రాఖీని రేవంత్‌కు కట్టారు. ఇద్దరు మహిళా మంత్రులు సీఎంకు రాఖీ కట్టిన సమయంలో అక్కడ సీఎం సతీమణి, కుమార్తె ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ కొద్దిరోజుల క్రితం చేసిన అనుచిత వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో పెద్ద దుమారం రేపడం, సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ అధిష్ఠానానికి సిఫారసు చేయడం తెలిసిందే. కాగా, సీఎంపై సుస్మితా పటేల్ విమర్శలు చేసిన సమయంలో ఆయన విదేశీ పర్యటనలో ఉన్నారు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత పలువురు మంత్రులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసినా.. కొండా సురేఖ మాత్రం కలవలేదు. ఈ నేపథ్యంలో సురేఖ సీఎంకు రాఖీ కట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఏటా సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి కొండా సురేఖ రాఖీ కడుతూ వస్తున్నారు. అయితే ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈసారి ఆమె సీఎంకు రాఖీ కడతారా? లేదా? అన్న ఆసక్తి ఇటు రాజకీయ వర్గాలతోపాటు అటు రాష్ట్ర ప్రజల్లోనూ నెలకొంది. వీటన్నింటికీ తెరదించుతూ కొండా సురేఖ ఎప్పటిలాగే సీఎంకు రాఖీ కట్టారు. అయితే గత ఏడాది తన కూతురు సుస్మితా పటేల్‌ను వెంటబెట్టుకుని వెళ్లి సీఎంకు రాఖీ కట్టిన సురేఖ.. ఈసారి మాత్రం మంత్రి సీతక్కతో కలిసివెళ్లారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన అంశాలపై సీఎంతో ఆమె చర్చించినట్లు తెలిసింది. మరోవైపు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, బ్రహ్మకుమారీస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, మలక్‌పేటలోని అంధ బాలికల పాఠశాల విద్యార్థినులు, పలువురు మహిళా ప్రజాప్రతినిధులు, మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన జొన్నల శ్వేత పవన్ అనే మహిళ, అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీకట్టి శుభాకాంక్షలు తెలిపారు.

**ఆడపడుచులకు సీఎం ఆశీర్వాదం ఉండాలి: మంత్రి కొండా సురేఖ**
తాను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టానని మంత్రి కొండా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా మూడోసారి ముఖ్యమంత్రికి రాఖీ కట్టానన్నారు. ఆయన అల్లుడికి, మనవడికి కూడా రాఖీ కట్టానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డిపై రాష్ట్రంలోని ఆడపడుచులందరి దీవెనలు, ఆశీస్సులు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆడపడుచులందరికీ ముఖ్యమంత్రి ఆశీర్వాదం ఉండాలన్నారు.

## కర్ణాటక మంత్రి పదవికి బి. నాగేంద్ర రాజీనామా



బెంగుళూరు, ఆగస్టు 28: **మీడియా టుడే**
కర్ణాటకలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. వాల్మీకి కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల కుంభకోణం జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో మంత్రి బి. నాగేంద్ర తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. సిద్ధరామయ్య ప్రభుత్వ హయాం లో వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని బీజేపీ, జేడీఎస్ నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తూ కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. వాల్మీకి కార్పొరేషన్‌లో భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని బీజేపీ, జేడీఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై కర్ణాటక ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష పార్టీలు ఆందోళనకు దిగాయి. మంత్రి బి. నాగేంద్ర రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల నేతలు నిరసనలు చేపట్టారు. అవినీతి ఆరోపణలపై కర్ణాటక ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ప్రతిపక్షాల నేతలు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో మంత్రి బి. నాగేంద్రపై రాజకీయ ఒత్తిడి పెరిగింది. వాల్మీకి కార్పొరేషన్ నిధుల వ్యవహారంలో తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన గతంలో మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఈ కేసును దర్యాప్తు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నుంచి క్లీన్‌చిట్ లభించడంతో ఆయనకు మరోసారి మంత్రి పదవి కేటాయించారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో నాగేంద్రకు తిరిగి మంత్రి పదవి కేటాయించారు. ఈ విషయంపై బీజేపీ, జేడీఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తికి మళ్లీ మంత్రి పదవి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ ప్రతిపక్షాల నేతలు ఆందోళనలకు దిగారు. ఈ వ్యవహారం కర్ణాటక రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ఒకవైపు నాగేంద్రకు సిట్ క్లీన్‌చిట్ రావడంతో మంత్రి పదవి కేటాయించగా, మరోవైపు రూ.187 కోట్ల కుంభకోణం ఆరోపణలను ప్రస్తావిస్తూ బీజేపీ, జేడీఎస్ నేతలు ప్రభుత్వంపై తీవ్రంగా ఒత్తిడి పెంచారు. తాజాగా నాగేంద్ర రాజీనామా ప్రకటన చేయడంతో ఈ అంశం మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## హైఫైవ్‌లు ఇస్తూ.. నవ్వులు చిందిస్తూ..

**ప్రధాని రాఖీ వేడుకలు**

**మోదీకి రాఖీలు కట్టిన విద్యార్థినులు**

**రాఖీ కట్టిన వారిలో తెలుగు బాలిక మధుమిత**



**న్యూఢిల్లీ, ఆగస్టు 28: మీడియా టుడే**
ప్రధానఇ మోదీ రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. దేశం నలుమూలల నుంచి న్యూఢిల్లీలోని ప్రధాని నివాసానికి వచ్చిన విద్యార్థినులతో మోదీ రక్షాబంధన్ వేడుకలు చేసుకున్నారు. చిన్నారులతో రాఖీలు కట్టించుకుంటూ, హైఫైవ్‌లు ఇస్తూ.. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ, ఆ పిల్లలు చెప్పిన కవితలు వింటూ కోలాహలంగా గడిపారు. ఢిల్లీ ప్రసాద్ నగర్‌లోని 'ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ' డాక్టర్ బి.వి. నాథ్ అండ్ టి.ఆర్. రావు మెమోరియల్ సీనియర్ సెకండరీ స్కూల్ 12వ తరగతి విద్యార్థిని, తెలుగు అమ్మాయి సాయి మధుమిత కూడా ఈ వేడుకల్లో ప్రధాని మోదీకి రాఖీ కట్టారు. ఈ వేడుకలకు ఢిల్లీలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 100 మంది విద్యార్థినులు ఎంపికవ్వగావారిలో సాయి మధుమిత ఒక్కరే తెలుగు అమ్మాయి కావడం విశేషం. 2026-27 విద్యా సంవత్సరంలో సైన్స్ విభాగంలో ప్రతిభ కనబరిచిన మధుమిత ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. ప్రధాని మోదీకి రాఖీ కట్టే అవకాశం లభిం చడం జీవితంలో మర్చిపోలేనని మధుమిత ఆనందం వ్యక్తం చేశారు.

# స్థానికంలోనూ సత్తా

## కూటమి ఘన విజయం సాధించాలి

**మూడు పార్టీల కార్యకర్తలూ ఐక్యంగా ఉండాలి: సీఎం**

**ఎన్నికలు జరగడం జగన్‌కు ఇష్టం లేదు**

**వాయిదాపడితే వైసీపీకి మేలనుకుంటున్నారు**

**అందుకే అడ్డుకునేందుకు ప్రయత్నాలు**

**సర్ ప్రక్రియపై కోర్టుకు కూడా వెళ్లారు**

**ఒక నాయకుడి వల్ల అధికారులు, పారిశ్రామికవేత్తలు జైలుకెళ్లింది ఏపీలోనే**

**2న పోలవరం ఎడమ కాలువ నుంచి నీరు**

**మాటిచ్చి మార్కాపురం జిల్లా ఏర్పాటు**

**ఇప్పుడు కానుకగా వెలిగొండ: చంద్రబాబు**



**అమరావతి, ఆగస్టు 28 మీడియా టుడే**
స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగడం గొడ్డలి పార్టీ అధినేతకు ఇష్టం లేదని, అందుకే వాటిని అడ్డుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలూ చేస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగించాలని.. ప్రతి బూత్, యూనిట్, క్లస్టర్ పరిధిలో టీడీపీని బలోపేతం చేయాలని ఆదేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు.. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు ఐక్యంగా ఉండాలని పిలుపిచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ యూనిట్ ఇన్‌చార్జుల శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. శుక్రవారం నిర్వహించిన తరగతి 50వది కావడంతో చంద్రబాబు చేతుల మీదుగా ట్రైనర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం యూనిట్ ఇన్‌చార్జులతో ఆయన 'కాఫీ కబుర్లు' నిర్వహించారు. విలేకరులతో కూడా మాట్లాడారు. ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడం లేదా వీలైనంత ఎక్కువ కాలం అవి వాయిదా పడేలా చూడడమే లక్ష్యంగా వైసీపీ వాళ్లు పనిచేస్తున్నారని.. ఎక్కువ కాలం వాయిదా వేయించగలిగితే అధికార పార్టీకి నష్టం జరిగి తమకు మేలు జరుగుతుందనే దింపుడు కళ్లెం ఆశతో జగన్ వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. 'సర్' ప్రక్రియపై గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లిందని, ఎన్నికలను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. 'సర్' ఓటర్ల తుది జాబితాను కేంద్ర ఎన్నికల కమిషన్ ఎప్పుడు ప్రకటించినా.. అది రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించే స్థానిక ఎన్నికలకు అడ్డుకాబోదని స్పష్టంచేశారు. చంద్రబాబు ఇంకా ఏం చెప్పారో ఆయన మాటల్లోనే.. సొంతంగా పేపర్, చానల్ పెట్టుకున్న పార్టీ మన రాష్ట్రంలో తప్ప దేశంలో ఎక్కడా లేదు. మీడియాను అడ్డం పెట్టుకుని గొడ్డలి పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని టీడీపీ కార్యకర్తలు తిప్పికొట్టాలి. నేరాలు చేయడం, చేయించడం గొడ్డలి పార్టీ నైజం. తాము చేయించిన నేరాలు తమ మెడకు చుట్టుకుంటాయని భావిస్తే.. సొంతవారినైనా అంతం చేయడానికి ఆ పార్టీ వెనుకాడదు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి సొంత కంపెనీలో పెట్టుబడులు పెట్టించిన ఘనత గొడ్డలి పార్టీది. ఆ పార్టీ అధినేత వల్లే అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారు. దేశ చరిత్రలో ఓ నాయకుడి వల్ల జైళ్లకు వెళ్లిన ఉదంతాలు లేవు. ఒక్క ఏపీలోనే ఇలా జరిగింది.

**మొదటి దశలో అనకాపల్లికి నీరు..**
సెప్టెంబరు 2న పోలవరం ఎడమ కాలువకు నీరు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాం. మొదటి దశలో అనకాపల్లి వరకు నీరిస్తాం. వచ్చే ఏడాది రెండో దశలో విశాఖ వరకు తరలిస్తాం. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది నేనే. 31న ప్రారంభించబోతోందీ నేనే. ఉమ్మడి ప్రకాశం జిల్లావాసులకు ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు వెలిగొండ ప్రాజెక్టునూ పూర్తి చేసి కానుకగా ఇస్తున్నాం. ఈ ప్రాంతాన్ని హార్టీకల్చర్ హబ్‌గానూ తీర్చిదిద్దుతాం.

## ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరుపై మంత్రి దామోదర్ సీరియస్



**జహీరాబాద్, ఆగస్టు 28 :మీడియా టుడే**
జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరుపై తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన వారిపై విచారణకు మంత్రి ఆదేశించారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేశారు. ఈ మేరకు జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్‌తో చికిత్సపై మీడియాలో వచ్చిన కథనాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తుతో మంత్రి దామోదర్ మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ హుకుం జారీ చేశారు.

## ఢిల్లీ-బిలాస్‌పూర్ విమానానికి త్రుటిలో తప్పిన ప్రమాదం

**రాయ్‌పూర్, ఆగస్టు 28: మీడియా టుడే**



ఢిల్లీ-బిలాస్‌పూర్ అలయన్స్ విమా నానికి శుక్రవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో టైర్ పేలింది. పైలట్ చాకుచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఈ సమయంలో విమానంలో 41 మంది ఉన్నారని ఎయిర్ పోర్ట్ అధికారులు వెల్లడించారు. వారిలో 37 మంది ప్రయాణికులు కాగా.. నలుగురు సిబ్బంది ఉన్నారని వివరించారు. విమానంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని తెలిపారు. ఈ ఘటన కారణంగా బిలాస్‌పూర్ నుంచి ఢిల్లీ వెళ్లవలసిన విమాన సర్వీస్‌ను రద్దు చేసినట్లు ఎయిర్ పోర్ట్ అధికారులు వివరించారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ 'పోరుబాట'

**హైదరాబాద్, ఆగస్టు 28: మీడియా టుడే**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై పోరుబాటకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. శుక్రవారంపార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మాజీ మంత్రి.. నేతలకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ మోసాలు చేసిందంటూ బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. వారం రోజుల పాటు వినూత్న నిరసన కార్యక్రమాలను చేపట్టాలని, 420 హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. వెయ్యి రోజులైనా నెరవేరని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని, కాంగ్రెస్ హామీల వైఫల్యం, అవినీతిపై పోరాడాలని టెలికాన్ఫరెన్స్‌లో నేతలకు కేటీఆర్ నిర్దేశం చేశారు. సెప్టెంబర్1న తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జ్‌షీట్‌తో బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లనుంది.

## తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం

**మద్యం కొనుగోలుకు డిజిటల్ టచ్!**

**చెన్నై, ఆగస్టు 28:మీడియా టుడే**
తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ తీసుకుంటున్న నిర్ణ యాలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. తనదైన పాలనతో విజయ్ ప్రజల్లోకి దూసుకెళుతున్నాడు. విద్య, వైద్యం, పరిశ్రమల విషయం లో ఇప్పటికే అనేక కీలక నిర్ణయాలు తీసుకున్న విజయ్ సర్కార్.. మద్యం షాపుల విషయంలో సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. మద్యం ఆర్డర్లకు డిజిటల్ టచ్ ఇచ్చేందుకు సిద్ధమైంది. తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం విక్రయించే సంస్థ టాస్మాక్ కీలక మార్పులు తీసుకురానుంది. మద్యం స్టాక్ ఆర్డర్లను నమోదు చేసేందుకు డిజిటల్ విధానాన్ని తీసుకురానుంది. సెప్టెంబర్ 1 నుంచి ఈ విధానాన్ని అమలు చేసేందుకు టాస్మాక్ సిద్ధమైంది. పేపర్ పద్ధతికి స్వస్తి పలికి, డిజిటల్ విధానం ద్వారా పరిమితులకు లోబడి ఆర్డర్లు తీసుకునేలా చర్యలు చేపట్టింది. కొత్త విధానంలో భాగంగా మద్యం దుకాణాల నిర్వాహ కులు తమ వద్ద ఉండే ప్రత్యేక హ్యాండ్‌హెల్డ్ పరికరాల ద్వారానే స్టాక్ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. స్థానిక అమ్మకాలు, డిమాండ్‌కు అనుగు ణంగా వినియోగదారులకు కావలసిన బ్రాండ్ల, ఇతర వివరాలను తెలుసుకునేం దుకు ఈ మార్పులు చేశామని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు.



## యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు

**మంత్రి తుమ్మల**



**హైదరాబాద్, ఆగస్టు 28: మీడియా టుడే**
వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పనిముట్లు ఖరారు చేశామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యాంత్రీకరణ సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం) వ్యవసాయశాఖపై మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఎంప్యానెల్ సంస్థల జాబితాను హాకా అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి స్పష్టం చేశారు. ఫెర్టిలైజర్ యాప్ సమస్యలను.. అదే రోజే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులకూ సబ్సిడీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అన్నదాతలు యూరియాను అధికంగా వాడే పరిస్థితి మారాలని అన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో వేగం పెంచాలని ఆదేశించారు. రైతులకు 2 నుంచి 3 రోజుల్లోనే ఆయిల్‌పామ్ మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాలకు మొక్కల సరఫరాలో ప్రాధాన్యం కల్పించాలని మంత్రి అన్నారు. లక్ష్యానికి రెండింతల ఆయిల్‌పామ్ మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటును వేగవంతం చేయాలని ఆదేశించారు. 2600 రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. 2 నుంచి 3 నెలల్లో రైతు వేదికలపై సోలార్ పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం చేశారు.

# జపాన్ సంస్థతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' భాగస్వామ్యం

**హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో సూత్రప్రాయ అంగీకారం**

**హైదరాబాద్‌కు రావాలని హెచ్ఐటీ ప్రతినిధులకు మంత్రి వివేక్ వెంకటస్వామి ఆహ్వానం**



**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, ఆగస్టు 28:** తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను అందించేందుకు జపాన్‌లోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థలతో భాగస్వామ్యాలను బలోపేతం చేస్తున్నామని శక్తి మరియు గనులు శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఇందులో భాగంగా హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (హెచ్ఐటీ), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యూ) మధ్య భాగస్వామ్యానికి సూత్రప్రాయ అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు. జపాన్ పర్యటనలో భాగంగా మంత్రి వివేక్ వెంకటస్వామి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం శుక్రవారం హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని సందర్శించింది. ఈ సందర్భంగా సంస్థ నాయకత్వంతో తెలంగాణలో సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల తయారీపై విస్తృతంగా చర్చించింది. తొలిదశలో పరస్పర అవగాహనతో భాగస్వామ్యాన్ని ప్రారంభించి.. తెలంగాణకు అవసరమైన నైపుణ్యాలు, సాంకేతికత, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సహకార రంగాలను సంయుక్తంగా గుర్తించాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. హెచ్ఐటీ--వైఐఎస్‌యూ భాగస్వామ్యంలో విద్యార్థుల పరస్పర మార్పిడి కార్యక్రమాన్ని కీలకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా తెలంగాణ విద్యార్థులకు జపాన్‌లోని సాంకేతిక విద్యా విధానం, ప్రయోగశాల ఆధారిత శిక్షణ, పరిశ్రమలతో అనుసంధానమైన విద్యా విధానంపై ప్రత్యక్ష అవగాహన కల్పించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా నేర్చుకునే అవకాశాలు కూడా కల్పించనున్నారు. అధ్యాపకులు, శిక్షకుల నైపుణ్యాభివృద్ధి, ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీఓటీ), స్వల్పకాలిక సాంకేతిక కోర్సులు, పరిశోధన, పరిశ్రమలతో ప్రత్యక్ష అనుభవం వంటి అంశాల్లోనూ సహకారాన్ని పరిశీలించాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. తెలంగాణలో స్థానిక అవసరాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్య రంగాలను ఎంపిక చేయనున్నారు. అధునాతన తయారీ, మొబిలిటీ, ఆటోమొబైల్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీలు, పర్యావరణ సాంకేతికత వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం పెంచుకోవడంపై చర్చించారు. హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ రంగంలోని సామర్థ్యాలు.. తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు అనుకూలంగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. కేవలం సంప్రదాయ విద్యా మార్పిడికి పరిమితం కాకుండా.. నైపుణ్యాలు, ఉపాధి సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, పరిశ్రమల అవసరాలకు నేరుగా ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. జపాన్ సాంకేతికత, తయారీ రంగం, పరిశ్రమల ఆధారిత విద్యా విధానంలోని ఉత్తమ పద్ధతులను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా అమలు చేయాలని అన్నారు. తరగతి గది, ప్రయోగశాల విద్యను వాస్తవ పరిశ్రమల సవాళ్లు, పరిశోధనతో అనుసంధానించే హెచ్ఐటీ విధానంపై తెలంగాణ ప్రతినిధి బృందం ప్రత్యేక ఆసక్తి చూపింది. ఇలాంటి విధానాలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు తెలంగాణ సాంకేతిక విద్యా వ్యవస్థలో ఎలా అమలు చేయవచ్చనే అంశంపై చర్చించారు.

**హైదరాబాద్‌కు రావాలని ఆహ్వానం**

హెచ్ఐటీ ప్రతినిధులను హైదరాబాద్‌కు వచ్చి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆహ్వానించారు. తదుపరి చర్చల ద్వారా భాగస్వామ్యానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

డిసెంబరులో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2026'లో పాల్గొని.. తెలంగాణతో మరిన్ని సంస్థాగత, పారిశ్రామిక భాగస్వామ్యాలను పరిశీలించాలని హెచ్ఐటీ ప్రతినిధులను మంత్రి ఆహ్వానించారు. జపాన్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలు, పరిశ్రమలతో నేరుగా సంస్థాగత సంబంధాలను ఏర్పరచుకోవడంలో ఈ భాగస్వామ్యం మరో కీలక ముందడుగని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సాంకేతిక విద్య, నైపుణ్యాలు, పరిశ్రమల అనుభవాన్ని తెలంగాణ యువతకు అందించేందుకు ఇటువంటి భాగస్వామ్యాలను మరింత విస్తరిస్తామని ఆయన పేర్కొన్నారు.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

**క్యూర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా**

**రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, ఆగస్టు 28:** హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు , రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ ప్రాంతంలో తొలి విడతగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు అత్యంత పారదర్శకంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, అర్హులైన లబ్ధిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తూ, మొత్తం ప్రక్రియను అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. లి నాంపల్లి నియోజ కవర్గంలోని రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి పరిధికి సంబంధించి లక్ష్మీగూడలో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈరోజు నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని మంత్రి వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తారని, ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారని మంత్రి గుర్తు చేశారు. అనంతరం రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప విజయమని అన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 2 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో అందిస్తోందని, చివరి విడత బిల్లుల చెల్లింపులు కూడా ప్రారంభమయ్యాయని వివరించారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వానికి డబ్బు కూడబెట్టుకోవడం కంటే పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా సొంత ఇంటిని అందించడం ముఖ్యమని అన్నారు. ఎకరం రూ.100 కోట్లు, రూ.200 కోట్లు, రూ.300 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలి అని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఇల్లు పొందిన అర్హులైన లబ్ధిదారులకు ఒక్క పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం పదేళ్ల తర్వాత అవసరాన్ని బట్టి ఇంటిని విక్రయించుకునే సదుపాయం ఉంటుందని చెప్పారు. అంతకుముందే ఏదైనా అత్యవసర అవసరం ఏర్పడితే, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను బ్యాంకులో కుదువ పెట్టుకుని రుణం పొందే అవకాశం కూడా ఉంటుందని వివరించారు. లక్కీడ్రాలో ఇల్లు పొందిన ప్రతి లబ్ధిదారుడికి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించి అందిస్తామని మంత్రి చెప్పారు. ఒక్కో ఇంటికి 17 నుంచి 20 గజాల అన్‌డివైడెడ్ షేర్ భూమి కూడా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన స్థలాల్లో అవసరాన్ని బట్టి 10 అంతస్తుల వరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని, లిఫ్ట్‌లతో పాటు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. లక్కీడ్రా పూర్తయిన తర్వాత లబ్ధిదారుల తుది ఎంపిక జరుగుతుందని, అధికారుల పరిశీలన అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని మంత్రి తెలిపారు. ఆ తర్వాత కేవలం 3--4 రోజుల్లోనే టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించుకునే అవకాశం కూడా ఉంటుందని మంత్రి తెలిపారు. నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీడ్రాలో తొలుత ఎస్సీ విభాగానికి కేటాయించిన 14 శాతం రిజర్వేషన్ ప్రకారం 67 ఫ్లాట్ల కోసం 288 మంది పేర్లతో కూడిన చీటీలను డ్రమ్ములో వేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, హౌసింగ్ ఎండీ వి.పి. గౌతమ్, కలెక్టర్ ప్రియాంక తదితర అధికారుల సమక్షంలో లబ్ధిదారులతోనే డ్రా తీయించారు. ఎస్సీ విభాగంలో తొలి ఫ్లాట్‌కు మరకాల కృష్ణవేణి ఎంపిక కాగా, అనంతరం టి.అనిత, మంగనూరి అనసూయ, ఎం.కుమారి, శైలజాకుమారి వరుసగా ఫ్లాట్లను లక్కీడ్రా ద్వారా పొందారు. ప్రతి నియోజకవర్గంలో సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎస్సీలకు -- 14 శాతం, ఎస్టీలకు -- 5 శాతం, బీసీలకు -- 16 శాతం, దివ్యాంగులకు -- 5 శాతం పారిశుధ్య కార్మికులు, నాలుగో తరగతి ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు -- 10 శాతం చొప్పున రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు వివరించారు. ఈ ఫ్లాట్లలో మొత్తం 50 శాతం రిజర్వేషన్లు ఉండగా, మొత్తంగా మహిళలకు 30 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## వేతన చెల్లింపులో జాప్యం, ఫారమ్-16 జారీపై చర్యలు తీసుకోవాలని TGHRC సిఫార్సు




**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, ఆగస్టు 28:** తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (౦+ు=జ), గౌరవ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన, ు=జ చీశీ.4763 శీట 2021లో 28.07.2026 తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ విరమణ చేసిన ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వేతనం దీర్ఘకాలం చెల్లించకపోవడం, తద్వారా ఆదాయపు పన్ను సంబంధిత ఇబ్బందులు ఎదురైన అంశంపై కమిషన్ విచారణ జరిపింది. ఫిర్యాదుదారు 23.10.2015 నుండి 24.02.2017 వరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఔవీజ)లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేశారు. సంబంధిత కాలానికి సంబంధించిన రూ.14,24,488/- వేతనం అక్టోబర్, 2018లో ఆయన మునుపటి పోస్టింగ్ స్థలం నుండి లాస్ట్ పే సర్టిఫికేట్ (ూాజ) అందిన అనంతరం ఒకేసారి చెల్లించబడింది. అలాగే, ఖీశీతీఎ-16, బిల్లు వారీ వివరాలు, ుణూ చెల్లింపుల వివరాలు సకాలంలో అందకపోవడంతో ఆదాయపు పన్ను శాఖ నుండి నోటీసులు అందినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. సంబంధిత అధికారుల నివేదికలను పరిశీలించిన కమిషన్, వేతనం చెల్లించడంలో ఒక సంవత్సరానికి పైగా జాప్యం జరిగినట్లు పేర్కొంది. ఉద్యోగి బదిలీ అయినప్పుడు సర్వీస్ రిజిస్టర్ , ఎల్పిసి ూాజ తదితర సేవా రికార్డులను సకాలంలో బదిలీ చేసి, వేతన చెల్లింపులో అంతరాయం లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత పరిపాలనా అధికారులపై ఉందని కమిషన్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, సంబంధిత ఇంజనీర్-ఇన్-చీఫ్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ మరియు కమిషనర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల వైపు జాప్యం ఉన్నట్లు కమిషన్ అభిప్రాయపడింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 18 కింద తన అధికారాలను వినియోగిస్తూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రధాన కార్యదర్శి ఫిర్యాదుదారుడి వేతన చెల్లింపులో జరిగిన జాప్యం మరియు అక్టోబర్, 2015 నుండి ఫిబ్రవరి, 2017 వరకు కాలానికి ఖీశీతీఎ-16 జారీ అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫార్సు చేసింది. పై సిఫార్సుతో కేసులో తదుపరి చర్యలను కమిషన్ ముగించింది.

## సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన గిరింత పారిజాత నర్సింహారెడ్డి




**బాలాపూర్ (మీడియాటుడే ప్రతినిధి ) , ఆగస్టు 28 :** పవిత్ర రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్, మహేశ్వరం నియోజకవర్గ నాయకురాలు శ్రీమతి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి అభినందనలు తెలియజేస్తూ, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరిన్ని విజయాలు ప్రసాదించాలని పారిజాత నర్సింహారెడ్డి ఆకాంక్షించారు.

## తమ్ముడికి రాఖీ కట్టిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




**బాలాపూర్ (మీడియాటుడే ప్రతినిధి ) ఆగస్టు 28 న్యూస్ :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి తన తమ్ముడు నరసింహారెడ్డి నివాసంలో రాఖీ కట్టి రక్షాబంధన్ వేడుకలను ఆత్మీయంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనురాగానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆనందం వెల్లివిరియాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. -- శ్రీమతి సబితా ఇంద్రారెడ్డిమహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి

## పోలీస్ కాల్పులకు ప్రాణాలు వదిలిన అమరవీరులకు నివాళులు

**సిపిఐ వలిగొండ మండల సమితి**

**కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే ఈనాడు ఉచిత విద్యుత్తు అందుతుంది**

**సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్**




**మీడియా టుడే వలిగొండ ఆగస్టు : 28** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సిపిఐ మాజీ కార్యదర్శి పోలేపాక యాదయ్య. ఈ సందర్భంగా సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్ మాట్లాడుతూఅప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం విద్యుత్ టారిఫ్‌లను పెంచింది. ముఖ్యంగా వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులపై పెంపు భారంగా మారుతుందని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు, వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో తీసుకున్న చర్యలు రైతులు, పేదలు, సామాన్య వినియోగదారులపై భారం పడుతుందని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ తరుణంలో బషీర్‌బాగ్ లో పోలీసులు లాఠీచార్జి, టియర్‌గ్యాస్, వాటర్ కేనన్లు ఉపయోగించిన తర్వాత కాల్పులు జరపడంతో ఈ ఘటనలో ముగ్గురు ఉద్యమకారులు బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ మరణించారు. పలువురు గాయపడ్డారని అన్నారు. ఆ పోరాటం స్ఫూర్తిగా తీసుకొని ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు శీలం స్వామి ఆనాటి ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాడాలని అన్నారు. బీసీ సంఘం నాయకులు సాయిని యాదగిరి మాట్లాడుతూప్రజా ఉద్యమాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని ప్రజల సమస్యలు పరిష్కరించినప్పుడే ప్రజలు చైతన్యమైతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సల్వాద్రి రవీందర్, సిపిఐ మండల సమితి సభ్యులు బొడిగే సుదర్శన్, చొప్పరి వెంకటేశం, కనక బోయిన ఆంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు ఎనుగుల ఉప్పలయ్య, జక్కుల నరసయ్య, ఆదిమూలం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## థోండి రమణకు రాఖీ కట్టిన పిసి ఉషారాణి

మీడియా టుడే ప్రతినిధి



**నిజామాబాద్ జిల్లా ఆగస్టు 28 :** ఆర్మూర్ పట్టణం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు థోండి రమణకి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిసి ఉషారాణి రాఖీ కట్టినారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమాను రాగాలకు ప్రతీక రక్షాబంధన్ తమ్ముడి చేతికి అక్క కట్టే రాఖీ కేవలం ఒక దారం కాదు జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా ఉంటామనే ప్రేమ, నమ్మకం, ఆప్యాయతలకు ప్రతీక చిన్ననాటి అల్లరి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ,కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తూ, కుటుంబ బంధాలను మరింత బలపరిచే ఈ పవిత్రమైన రోజున అక్కా చెల్లెళ్లకు, అన్నా తమ్ముళ్లకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుతూ అందరి కుటుంబాల్లో ప్రేమ, ఆనందం, ఐక్యత ఎల్లప్పుడూ వెల్లివిరియాలని కోరుకుంటున్నానని థోండి రమణ అన్నారు.

# పెండింగ్ భూసమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ కలెక్టరేట్: (మీడియా టుడే) ఆగస్టు 28, 2026**




పెండింగ్‌లో ఉన్న భూసమస్యల దరఖాస్తులను ప్రాధాన్యత ప్రాతిపదికన వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి తహసీల్దార్లతో పెండింగ్ భూసమస్యల దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి విచారణను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారుల వినతులను నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. తగిన ఆధారాలు లేని దరఖాస్తులను తిరస్కరించే సమయంలో అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. భూసమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, రెవెన్యూ, సర్వే బృందాలు సమన్వయంతో పనిచేసి భూవివాదాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# మంథని లో ఘనంగా నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం


**- కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన అవధానుల పురుషోత్తం, కిషోర్ శర్మ**



**మంథని ఆగస్టు 28 (మీడియా టుడే):**
మంథని పట్టణంలోని అన్ని వాడల్లోని దేవాలయాల్లో శుక్రవారం నూతన యజ్ఞోపవిత్రధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తమ్మి చెరువుకట్ట వీధిలో గల శ్రీ హనుమాన్ దేవాలయం లో వేద పండితులు అవధానుల పురుషోత్తం శర్మ, కిషోర్ శర్మ లు హోమగుండం ఏర్పాటుచేసి వేదమంత్రాలతో బ్రాహ్మణులచే నూతన యజ్ఞోపవీతము వేయించారు. ఉపవీతాలు యజ్ఞోపవీతాలు దారం పోగులచే మూడు వరసలుగా చేసి బ్రహ్మముడితో చేయబడినది (జంధ్య ము) యజ్ఞోపవీతం. హిందువులు దారపు పోగులనే ధర్మం కోసం అన్ని కార్యక్రమాల్లోనూ ఉపయోగిస్తారు. స్త్రీలు వ్రత తోరణాలు, మంగళసూత్రం మొదలగు వాటికి దారపు పోగులను ఉపయోగించడం ఉదాత్త భాగంగా పరిగణిస్తారు. అలాగే ఈ రోజున సోదరీ సోదరీమణులు సోదరులకు రక్షాబంధన్ కట్టి ఆశీర్వాదం పొందుతారు.

# చైర్మన్ గోనెలహరి రఘు కు రాఖీ కట్టిన సోదరీమని

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 28 :**



ఆర్మూర్ పట్టణం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే పవిత్రమైన ప్రేమానురాగాలకు, రక్షణకు ప్రతీక రక్షాబంధన్ అని ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి రఘు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ తమ నివాసంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గోనె లహరి రఘు పట్టణ ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ అనగా రక్షణ కల్పించే పవిత్రమైన ముడి అని అర్థం అని, మన పురాణాల్లో రక్షాబంధన్ కు గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. శిశుపాలుడిని వధించే సమయంలో శ్రీకృష్ణుడి వేలికి గాయం కావడంతో ద్రౌపది వెంటనే తన చీర కొంగును చింపి కృష్ణుడి వేలికి కట్టింది. ఆ రక్షణ బంధానికి కృష్ణుడు సంతోషించి, ద్రౌపదికి ఎప్పుడూ అండగా ఉంటానని మాట ఇచ్చాడు. ఇలా ప్రత్యేకమైన చరిత్ర కలిగిన పండుగ రాఖీ పండుగ అని అన్నారు. పట్టణ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల మధ్య రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోనె దామోదర్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వెళ్లి విరిసిన మత సమరస్యం

**ఆగస్టు 28 (మీడియా టుడే**



ఈరోజుల్లో సొంత బంధుత్వాలు దూరం అవుతున్న సందర్భాలు పుష్కళం కానీ రాఖీ పార్వదినాన కులం, మతాలు వేరు వేరు అయినా రాఖీ పండుగ మాత్రం మత సమరస్యని చాటుకున్నది )వరంగల్ రూరల్ జిల్లా ఖానాపూరం మండలం అశోక్ నగర్ గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ రహమాన్ కు కాత్రపల్లి గ్రామనికి చెందిన పాల్వాయి సుప్రియ గత పది సంవత్సరాల నుండి ఎన్ని అడ్డంకులు వచ్చిన ప్రతి రాఖీ పౌర్ణమి నాడు క్రమం తప్పకుండా రాఖీ కట్టుచు మత సమరస్యని చాటుకుంటుంది రాఖీ అంటే మనకు కులం మతం అనే బేధాలు లేకుండా ఒకరికి ఒకరు కలిసి మెలిసి ఉండాలి అని వీరు అభిప్రాయ పడుతున్నారు

# మోత్కూర్ లో ఘనంగా గాయత్రీ ధారణ కార్యక్రమం

**మీడియా టుడే, ఆగస్టు28/ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:**



యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయంలో రాఖీ పండుగ ( నూలు పౌర్ణమి )సందర్భంగా శుక్రవారం రోజున పద్మ బ్రాహ్మణులు మహేశ్వరం నాగరాజు ఆధ్వర్యంలో గాయత్రీ ధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూజా సామాగ్రి దాత మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచం జగన్ ఆధ్వర్యంలో పూజా సామాగ్రి అందజేసి మాట్లాడుతూ వచ్చే కార్తీకమాసంలో శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయ ప్రారంభం చేస్తున్నామని, పద్మశాలి కుల బాంధవులు దాతలు పెద్ద ఎత్తున సహకరించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల బాంధవులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేసినారు.

# ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు




**నిర్మల్ జిల్లా:( మీడియా టుడే) ఆగస్టు 28, 2026**
జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో భైంసాలోని ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో క్రీడాకారులకు మానసిక ఉల్లాసం, స్నేహభావం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించే విధంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు. నిర్మల్ జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రం కోచ్ శ్రీరాముల సాయికృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. శిక్షణ కేంద్రంలోని క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని వివిధ క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. విధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బంగారు, రజత పతకాలను జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ రజిత మహేష్ అందజేసి అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని భారతదేశంలో జరుపుకుంటామని, భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తామని తెలిపారు. యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, క్రమశిక్షణ, పట్టుదల, టీం స్పిరిట్ వంటి విలువలను పెంపొందించడం జాతీయ క్రీడా దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. క్రీడలు కేవలం పోటీలకు మాత్రమే పరిమితం కాకుండా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ, ప్రోత్సాహం అందించేందుకు ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. యువత ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామం, యోగా వంటి శారీరక కార్యకలాపాలకు కేటాయించాలని పిలుపునిచ్చారు.

# కీసర నవోదయ విద్యాలయంలో ఘనంగా రాఖీ పూర్ణిమ వేడుకలు

**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: కీసర ఆగస్టు 28**
కీసర నవోదయ విద్యాలయంలో రాఖీ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో పాలు పంచుకున్నారు. పలువురు విద్యార్థులు, అధ్యాపకులు మాట్లాడుతూ రాఖీపూర్ణిమ ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. మన సనాతన ధర్మంలో ప్రతి పండుగ ఒక ప్రత్యేకతను కలిగి ఉందని, రాఖీ పూర్ణిమను కొన్ని యుగాలనుండి మనం జరుపుకుంటున్న పవిత్రమైన పండుగని,సోదర సోదరీమణులు పవిత్ర స్నేహ భావంతో,భక్తి శ్రద్ధలతో దేశమంతా జరుపుకుంటారని,జీవితాంతం ఒకరికొకరు తోడుగా వుండి రక్షణను అందిస్తానని ధీమా వ్యక్తం చేసి ధైర్యాన్ని అందించి ఆశీర్వదిస్తారని, దీనిని మొదట దేవేంద్రుడు శచీదేవి జరుపుకున్నారని, దేవతలకు, రాక్షసులకు యుద్ధం జరిగినపుడు దేవేంద్రుడు రాక్షసులతో ఓడిపోయి అమరావతిలో తలదాచుకున్న సందర్భంలో శ్రావణ పూర్ణిమారోజున పార్వతి పరమేశ్వరులను, లక్ష్మీనారాయణులను పూజించి రక్షాసూత్రాన్ని దేవేంద్రుని చేతికి కట్టి ధైర్యాన్ని అందిస్తుంది ఇంద్రాణి. ఆ తర్వాత దేవతలందరూ దేవేంద్రునికి రక్షా సూత్రాన్ని కట్టి దేవేంద్రుని ఉత్సాహ పరుస్తారు. అపుడు దేవేంద్రుడు ఆత్మస్థైర్యంతోరాక్షసులతో యుద్ధంచేసి గెలుపొందుతాడు. అప్పట నుండి రక్షాబంధన్ సమాజంలోని మగవారికి ఆత్మస్థైర్యాన్ని అందించడానికి స్త్రీలు రక్షాబంధన్ ఆనందోత్సాహాలతో జరుపు కుంటారు. మహాభారత కాలంలో శ్రీకృష్ణుడు శిశుపాలుని సంహరించే సందర్భంలో చూపుడువేలుకు గాయమైనప్పుడు సోదరి ద్రౌపది తన చీర కొంగును చింపి శ్రీకృష్ణుని చూపుడు వేలుకు కడుతుంది. అపుడు శ్రీకృష్ణుడు నీకు ఆపత్కాలంలో అండగా వుండి రక్షిస్తానని వస్త్రాపహరణ సమయంలో రక్షిస్తాడు. అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తినపుడు అతని భార్య రుక్సానా పురుషోత్తముని చేతికి రాఖీ కట్టి భర్తను రక్షించుకుంటుంది. అలాగే బలిచక్రవర్తి తన తపస్సు ద్వారా విష్ణుమూర్తి తనదగ్గర పాతాళ లోకంలో ఉండేలా చేసుకున్నప్పుడు లక్ష్మీదేవి బలిచక్రవర్తికి రాఖీ కట్టి తన భర్తను వైకుంఠానికి తీసుకు పోతుందని మన పురాణాలు చెప్తున్నాయి. పాఠశాల ప్రధానాచార్యులు మాధవరావు వారి ప్రసంగంలో మాట్లాడుతూ విద్యార్థులంతా సమైక్యంగా ఉంటూ విద్యలో పోటీతత్వాన్ని, క్రమశిక్షణను, సమయపాలనను, పాటిస్తే లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని రాఖీ పూర్ణిమ సందర్భంగా సందేశాన్నిచ్చారు.




# మానవత్వం చాటుకున్న చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి

**మానస విద్యామందిర్ మాజీ ఉపాధ్యాయుడు సంతోష్ మృతికి ఘన నివాళి**

**బాధిత కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయం**

**సంతోష్ భార్యకు పాఠశాలలో ఉద్యోగం, కుమారుడికి ఉచిత విద్య**

**చైర్మన్ ఉదారతపై సర్వత్రా ప్రశంసల వర్షం**




**మీడియా టుడే, ఆగస్టు28/ ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్ :**
ఆపదలో ఉన్న తమ పాఠశాల ఉపాధ్యాయుడి కుటుంబానికి నేనున్నాను అంటూ మానస విద్యామందిర్ హైస్కూల్ ( బిఎంఆర్ఎస్ ) చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో అకాల మరణం చెందిన పాఠశాల మాజీ మ్యాథ్స్ టీచర్ కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయంతో పాటు, ఆ కుటుంబానికి శాశ్వత భరోసానిచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో గల మానస విద్యామందిర్ హైస్కూల్‌లో నిరునేముల సంతోష్ గతంలో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేశారు. ఆయన అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సంతోష్ మృతికి సంతాపంగా బుధవారం పాఠశాల ప్రార్థనా సమయంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయనకు అశ్రు నివాళులు అర్పించారు.

**మల్లారెడ్డి పెద్ద మనసు.. సంతోష్ కుటుంబానికి కొండంత అండ:**

సంతోష్ అకాల మరణంతో పెద్ద దిక్కును కోల్పోయి శోకసంద్రంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి తక్షణమే స్పందించారు. ఆ కుటుంబం రోడ్డున పడకూడదన్న సదుద్దేశంతో ఆయన ఆ కుటుంబానికి తక్షణ అవసరాల నిమిత్తం రూ. 50 వేల రూపాయల ఆర్థిక సాయం, ఆ కుటుంబానికి శాశ్వత ఆర్థిక భద్రత కల్పించేందుకు సంతోష్ భార్యకు తమ పాఠశాలలోనే ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. సంతోష్ కుమారుడి భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, తమ పాఠశాలలోనే అతనికి పూర్తిగా ఉచితంగా విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. కష్టకాలంలో ఉన్న ఒక ఉపాధ్యాయుడి కుటుంబానికి ఇంతటి అండగా నిలిచిన పాఠశాల చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి గొప్ప మనసుపై స్థానికులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొండెంట్ నిమ్మ శేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సచిన్, పిఈటి శ్రీలత, నవనీత అనిఫ్, ఉపాధ్యా బృందం తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి పండుగ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు



**మీడియా టుడే, ఆగస్టు28/ ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:**
రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత రాఖీ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆడపడుచులు, మహిళలు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా ఆడపడుచులు చూపిన ప్రేమాభిమానాలకు బీర్ల అయిలయ్య కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత అన్నదమ్ములకు స్వయంగా రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, అనుబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి పండుగ ప్రతి కుటుంబంలో సంతోషాలను నింపాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# అన్నా చెల్లెల బంధానికి ప్రతీక రాఖీ

**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్- రాజగృహాలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు**

**మంథని, ఆగస్టు 28 (మీడియా టుడే)**
అన్నా చెల్లెల అనుబంధానికి రాఖీ ప్రతీకగా నిలుస్తుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. రాఖీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం మంథనిలోని రాజగృహాలో రక్షా బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సోదరీమణులు శంకరమ్మ, శశికళ లు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా రాఖీ పండుగకు ఒక ప్రత్యేకత ఉందని, అక్కకు, చెల్లెకు ప్రాణం పోయేవరకు తోడుగా ఉంటానని భరోసా కల్పించేలా రాఖీ కడుతారని ఆయన తెలిపారు. రాఖీ పండుగతో సోదరబావం పెంపొందుతుందని, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు రాఖీ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకుంటారని అన్నారు. నాకు నీవు రక్షా...నేను నీకు రక్షా అంటూ ఆప్యాయతను చాటుతూ అన్నయ్యకు చెల్లెల్లు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కడుతారని ఆయన వివరించారు. అనంతరం పలువురు మహిళలు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌కు రాఖీలు కట్టారు. అలాగే మంథని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజ పలువురు ముస్లిం, మైనార్టీ నాయకులకు రాఖీలు కట్టి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంథని నియోజకవర్గ ప్రజలకు, సోదరీమణులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



# ఆలేరులో విద్యుత్ అమరవీరులకు ఘన నివాళులు

## జోహార్లు అర్పించిన విప్లవ,వామపక్ష పార్టీల నేతలు



**మీడియా టుడే, ఆగస్టు28/**
**ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:**

2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా విప్లవ,వామపక్ష పార్టీలు,ప్రజా సంఘాలు,అన్ని వర్గాల ప్రజలు సాగించిన వీరోచిత పోరాటం లో నరహంతక చంద్రబాబు నాయుడు ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో రామకృష్ణ, బాలస్వామి , విష్ణువర్ధన్ లు ముగ్గురు అమరులయ్యారని, విద్యుత్ పోరాటం,ముగ్గురు వీరులు అమరులవ్వడంతో నాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కుప్పకూలిందని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్,సీపీఎం సీనియర్ జిల్లా నాయకులు మొరిగాడి చంద్రశేఖర్ లు అన్నారు. శుక్రవారం నాడు ఆలేరు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు విద్యుత్ అమరవీరుల ఫోటో లకు పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు, నివాళులర్పించారు.ఈ సందర్భంగా జనార్ధన్, వెంకటేష్,చంద్రశేఖర్ లు మాట్లాడుతూ, విపరీతంగా పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ,అదే విధంగా మరో సందర్భంలో అంగవాడీ కార్మికులను పర్మనెంట్ చేయాలని , సౌకర్యాలు మెరుగుపరచాలని,కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పోరాడిన అంగన్వాడీలపై గుర్రాలతో తొక్కించిన చంద్రబాబు నాయుడు మహిళా కార్మిక వ్యతిరేకి అని,విద్యుత్ చార్జీలను తగ్గించాలని పోరాడిన ప్రజలపై పోలీస్ కాల్పులు జరిపించిన నరహంతకుడు చంద్రబాబు నాయుడు అని తీవ్రంగా విమర్శించారు. నాడు చంద్రబాబు,నేడు బీ జే పీ మోడీ ప్రభుత్వం కేంద్రంలో విద్యుత్ సంస్కరణలను ముందుకు తెచ్చి, మోటార్లకు మీటర్లను బిగించే ప్రయత్నంలో ఉన్నదని,విత్తన బిల్లు,స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పేరుతో దేశ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని బలహీనపర్చడంతో పాటు, దేశీయ ఉత్పత్తులనింటిని పాతరేసే దుర్మార్గమైన పాలన నేడు దేశంలో కొనసాగుతున్నదని అన్నారు.పూర్తిగా విదేశీ వస్తువులపై ననే ఆధారపడే విధంగా దేశ విద్రోహకర,బడా కార్పోరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తున్నదని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన అనేక వాగ్దానాలను మూడేండ్లు గడిచినప్పటికి అమలుచేయలేక పోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య,సీపీఎం మండల నాయకులు వడ్డేమాన్ బాలరాజు, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్,ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల బాల మల్లేష్,అరుణోదయ జిల్లా నాయకులు ఇక్కిరి శ్రీనివాస్, సీపీఎం మండల నాయకులు గణగాని మల్లేష్,ఖలీల్,ఎం.డీ. పతీన్, సీపీఐ మండల నాయకుడు గిరబోయిన స్వామి,ప్రజా సంఘాల నాయకులు కుర్రి సత్యనారాయణ,బుడిగె లక్ష్మయ్య, గుజ్జ పాండు, నమిలే అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల విద్యే దేశ సాధికారతకు పునాది

**బాలికను చదివిద్దాం--దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం**

**సందేశంతో రాఖీలు కట్టిన బాలసదనం బాలికలు.**

**బాలికలను ఆశీర్వదించి మిఠాయిలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**ములుగు జిల్లా ఆగష్టు28(మీడియా టుడే)**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనం బాలికలు శుక్రవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును కలిసి రాఖీలు కట్టారు.బాలికను చదివిద్దాం--దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం అనే సందేశంతో ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను కలెక్టర్‌కు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించడంతోపాటు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికలతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, భద్రత, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బాలికల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందిస్తుందని భరోసా కల్పించారు.జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత మాట్లాడుతూ రక్షాబంధన్ ప్రేమానుబంధంతోపాటు పరస్పర బాధ్యత, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఒక బాలికను చదివించడం ద్వారా ఆమె భవిష్యత్తుతోపాటు కుటుంబం, సమాజం, దేశ పురోగతికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు.ఈ కార్యక్రమంలో బాలల సహాయవాణి జిల్లా సమన్వయకర్త నరేష్, బాలసదనం సిబ్బంది అరుణ, రాణి, సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామ నూతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ శాఖ నూతన కమిటీల ఎన్నిక

**ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ బాటలో అసమానతలు లేని సమాజ నిర్మాణంకై పోరాడుదాం**

**నల్ల చంద్ర స్వామి మాదిగ - ఆలేరు నియోజకవర్గ ఇంచార్జీ**



**మీడియా టుడే, ఆగస్టు28/**
**ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మత దురంహకారం కుల వివక్షత సాఘీక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం జరిగే కర్తవ్య నిర్వహణకై జాతిని సమగ్ర అభివృద్ధి వైపు నడిపించే దిశగా క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్ కమిటీల పునర్నిర్మాణం ఏర్పాటు చేయుటలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు (ఎం)మండలం పల్లెర్ల గ్రామం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీ ఎన్నిక సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి నల్ల చంద్ర స్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ సాధించిన అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగల పేదరిక నిర్మూలన కోసం అదేవిధంగా సామాజిక,ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని వ్యవస్థ కోసం భవిష్యత్తు పోరాటం కొనసాగుతుందని తెలిపారు ఈ పోరాటానికి మాదిగలు మరింత శక్తివంతంగా సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఎమ్మార్పియస్ మండల సదస్సు జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా జరుగుతుందని సదస్సుకు గ్రామం నుండి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి విశిష్ట అతిథిగాఆత్మకూరు(ఎం) మండల కో ఇంచార్జీ మందుల లింగ స్వామి మాదిగ హాజరు కావడం జరిగింది. సమావేశం అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా వస్తుపుల జంగులు మాదిగ; అధికార ప్రతినిధిగా మోత్కూర్ శేఖర్ మాదిగ;ప్రధాన కార్యదర్శిగా మేడి రవి మాదిగ; ఉపాధ్యక్షులుగా జన్నపాల నరేష్ మాదిగ;కార్యదర్శిగా కొమ్ము సంతోష్ మాదిగ;కార్యవర్గ సభ్యులుగా ఎడ్ల నవీన్ మాదిగ;మేడి చరణ్ మాదిగ; మేడి అర్జున్ మాదిగ; ఎడ్ల శివకుమార్ మాదిగ;మోత్కూర్ నవీన్ మాదిగ; వస్తుపుల నవీన్ మాదిగ; ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీ అధ్యక్షులుగా కొమ్ము సంపత్ మాదిగ;అధికార ప్రతినిధిగా మేడి నగేష్ మాదిగ; ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల సంజీవ మాదిగ; ఉపాధ్యక్షులుగా మేడి ఆనంద్ మాదిగ; కార్యదర్శిగా వస్తుపుల పాపయ్య మాదిగ; కార్యవర్గ సభ్యులుగా మేడి నర్సింగ్ రావ్ మాదిగ,ఎడ్ల సహదేవ్ మాదిగ,వస్తుపుల మల్లేష్ మాదిగ, సంగపాక నవీన్ మాదిగ,మేడి నర్సింహ్మా మాదిగ, తదితరులను ఎన్నుకోవడం జరిగింది. మండల కమిటీకి గ్రామం నుండి ఎమ్మార్పియస్, ఎంఎస్పీ బాధ్యులుగామేడి రామ్ లక్ష్మణ్ మాదిగ,జన్నపాల శేఖర్ మాదిగ,మేడి స్వామి మాదిగ, కొమ్ము మత్స్యగిరి మాదిగ,కొమ్ము రాజు మాదిగ, ముత్తయ్య మాదిగలుఎన్నికయ్యారు. జర్నలిస్ట్ విభాగానికి మేడి స్వామి మౌర్య మాదిగ,ఉద్యోగ విభాగానికి మోత్కూర్ కృష్ణ మాదిగలు ఎన్నికయ్యారు.

# మంత్రి ఉత్తమ్,ఎమ్మెల్యే పద్మావతిలపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు



**కోదాడ, ఆగస్టు 28 (మీడియా టుడే)-:**

కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల అభివృద్ధియే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు.?శుక్రవారం వార్డు కౌన్సిలర్ పాశం శ్రీను నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులుమాట్లాడారు.బిఆర్ఎస్ కార్యకర్త మాదాల ఉపేందర్ గతంలో కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయారని, ఆయన స్థాయి ఏంటో తెలుసుకొని మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిలపై విమర్శలు చేయాలని హితవు పలికారు.?ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం,అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఏవైనా సందేహాలు ఉంటే బాధ్యతాయుతంగా ప్రశ్నించాలే తప్ప,స్వార్థ రాజకీయాల కోసం వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోదాడ నియోజకవర్గంలో సాగించిన దందాలు, అక్రమాలపై తీవ్ర స్థాయిలో ప్రజల్లో వ్యతిరేకత రావడం వల్లే బిఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించి ఓడించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.?నాయకులు ఇప్పటికైనా హద్దుమీరి మాట్లాడటం మానుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సమావేశంలో నాయకులు ఈదుల కృష్ణయ్య, కట్టబోయిన శ్రీనివాస యాదవ్, గుండెల సూర్యనారాయణ యాదవ్, మోదెం సైదుబాబు, కోట హరీష్, చీదెళ్ల హనుమంతరావు,యలగందుల శ్రీను, చింతలపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ ఇంట రక్షాబంధన్ సందడి

**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా: కీసర ఆగస్టు 28**



రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఫౌండర్ & చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్ ఇంటా పండుగ వాతావరణం నెలకొన్నది. చైర్మన్ కుటుంబ సభ్యులకు వారి ఆడపడుచులు రాఖీలు కట్టి అన్న చెల్లెల అనుబంధాన్ని చాటుకున్నారు.

# జేఎస్‌జేబీ పనులపై కేంద్ర జల సంఘం సంతృప్తి



**నడిగూడెం, ఆగస్టు 28(మీడియా టుడే)-:**

నడిగూడెం మండలంలోని నడిగూడెం, వేణుగోపాలపురం, ఈకేపేట్, రామాపురం గ్రామాల్లో చేపడుతున్న జేఎస్‌జేబీ పనులను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నోడల్ అధికారి శ్రీ వి. గణేష్‌గారు పరిశీలించారు.పనుల పురోగతి, నాణ్యత, అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనుల ద్వారా నీటి వనరుల అభివృద్ధితో పాటు భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు.పనులను పరిశీలించిన అనంతరం, ఇప్పటివరకు చేపట్టిన పనుల అమలు తీరుపై కేంద్ర జల సంఘం వారు సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను కూడా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూరు , ఈసీ శ్రీనివాస్, టీఏ అంజిరెడ్డి, ఎఫ్ఏ అంబేద్కర్, ప్లాంటేషన్ మేనేజర్ వినయ్ భార్గవ్, జేఈ నగేష్ పాల్గొన్నారు.

# నూతన సమీకృత కలెక్టరేట్‌కు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయం తరలింపు

**డిపిఆర్ఓ రఫీక్**

**నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచే శాఖ కార్యకలాపాలు**

**గ్రౌండ్ ఫ్లోర్‌లోని జీ--20 గదిలో కార్యాలయం ఏర్పాటు**

**ములుగు జిల్లా ఆగష్టు28(మీడియా టుడే)**



ములుగు పాత కలెక్టరేట్‌లో ఇప్పటివరకు కొనసాగుతున్న జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని నూతనంగా ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి తరలించినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. రఫీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న జీ--20 గదిని జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి జిల్లా కలెక్టర్ కేటాయించినట్లు పేర్కొన్నారు.ఇకపై జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయ కార్యకలాపాలు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచే కొనసాగుతాయని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అధికారిక సమాచార వ్యవహారాలు, మీడియా సమన్వయం, ఇతర కార్యాలయ కార్యకలాపాలు ఇకపై నూతన ఐడీఓసీ నుంచే నిర్వహించనున్నట్లు డీపీఆర్ఓ ఆ ప్రకటనలో వెల్లడించారు.

# చిల్డ్రన్ హోమ్ విద్యార్థులతో కలెక్టర్ రక్షాబంధన్ వేడుకలు.

**సూర్యాపేట, ఆగస్టు 28 (మీడియా టుడే):**



రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో సూర్యాపేట జిల్లాలోని చిల్డ్రన్ హోమ్ విద్యార్థులు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ విద్యార్థినులు జిల్లా కలెక్టర్‌కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. చిల్డ్రన్ హోమ్‌లోని పిల్లలు బాగా చదువుకుని, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మిఠాయిలు అందించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలతో కలిసి వేడుకల్లో పాల్గొని వారిలో ఆనందాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే. నరసింహారావు, జి. హుస్సేన్, జిల్లా బాలల రక్షణ అధికారి బి. రవి కుమార్, మహిళా సాధికారత కోఆర్డినేటర్ ఎం. చైతన్య, చిల్డ్రన్ హోమ్ సిబ్బంది, మహిళా సాధికారత సిబ్బంది, జిల్లా బాలల రక్షణ యూనిట్ సిబ్బంది, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, ఆగస్టు 28 (మీడియా టుడే ప్రతినిధి)**



రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నా-చెల్లెళ్ల, అక్కా-తమ్ముళ్ల అనుబంధానికి రాఖీ పౌర్ణమి ప్రతీక అని అన్నారు. కష్టసుఖాల్లో తోడుగా, అండగా ఉంటానన్న భరోసాను రాఖీ తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆడపడుచులందరికీ ఆశీస్సులు అందించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యాపార ఆవిష్కరణ, సుస్థిర సమాజంపై గీతంలో అంతర్జాతీయ సదస్సు

**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 28 :** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ కు చెందిన సెంటర్ ఫర్ బిజినెస్ గ్రోత్ (సీబీజీ), రెండవ అంతర్జాతీయ వ్యాపార ఆవిష్కరణ, సుస్థిర సమాజం సదస్సు (బీఐఎస్ఎస్-2026)ను డిసెంబర్ 10-11, 2026 తేదీలలో నిర్వహించన ఌంది.'మానవ-యంత్ర అనుసంధానం ద్వారా వ్యాపార శ్రేష్ఠత: మానవ అంతర్దృష్టి, యంత్ర మేధస్సు' అనే ఇతివృత్తంతో జరగనున్న ఈ సదస్సు, వ్యాపారంలో మానవ మేధస్సు, కృత్రిమ మేధస్సు మధ్య అభివృద్ధి చెందుతున్న సంబంధాన్ని అన్వేషించడానికి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, వర్ధమాన పండితులను ఒకచోట చేర్చనుంది. అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉన్న ఎలోన్ విశ్వవిద్యాలయంలోని మార్తా అండ్ స్పెన్సర్ లవ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, మేనేజ్ మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రొఫెసర్ హయా అజ్జన్ కీలకోపన్యాసం చేయనున్నారు. బీఐఎస్ఎస్-2026. అత్యాధునిక పరిశోధనలను ప్రదర్శించడానికి, ఆలోచనలను పంచుకోవడానికి, వివిధ రంగాల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు స్వీకరణకు సంబంధించిన పరివర్తనాత్మక విధానాలను పరిశీలించడానికి ఒక ప్రపంచ వేదికను అందిస్తుంది. సంస్థలు బలమైన మానవ-కేంద్రీకృత దృక్పథాన్ని కొనసాగిస్తూనే, ఆవిష్కరణ, ఉత్పాదకత, సుస్థిరత, సమ్మిళితత్వం, దీర్ఘకాలిక వ్యాపార వృద్ధిని సాధించడానికి కృత్రిమ మేధస్సును ఎలా ఉపయోగించుకోవచ్చు అనే అంశంపై చర్చలు కేంద్రీకృతమవుతాయి. ఈ సదస్సులో కీలకోపన్యాసాలు, పరిశోధనా పత్రాల సమర్పణలు, పోస్టర్ ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక వర్ధమాన పండితుల వేదిక ఉంటాయి. ఏఐ వ్యాపార పరివర్తన, సుస్థిరత, సమ్మిళిత అభివృద్ధికి సంబంధించిన భావనాత్మక పత్రాలు, అనుభావిక అధ్యయనాలు, కేస్ విశ్లేషణలు, అంతర్-విషయ పరిశోధనలను సమర్పించడానికి ఒక ప్రత్యేక వేదిక యూజీ, పీజీ విద్యార్థులకు అవకాశాన్ని అందిస్తుంది. ఎంపిక చేసిన అధిక-నాణ్యత పత్రాలు, సంబంధిత జర్నల్స్ పీర్-రివ్యూ, సంపాదకీయ నిర్ణయాలకు లోబడి ఐజేపీఎం, ఐజేపీఎంబీ వంటి అనుబంధ స్కోపస్-ఇండెక్స్ జర్నల్స్ కు ప్రచురణకోసం పంపడానికి పరిగణనలోకి తీసుకోవచ్చు. ఈ సదస్సులో సమర్పించిన అత్యుత్తమ పత్రాలు ఉత్తమ పత్ర పురస్కారాల కోసం కూడా పరిగణించబడతాయి. అమూర్త పత్రాలను సెప్టెంబర్ 15 లోగా, పూర్తి పత్ర సమర్పణ అక్టోబర్ 10వ తేదీ లోగా చేయాలని, సదస్సులో పాల్గొనాలనుకునే వారు తమ పేర్లను సెప్టెంబరు 30లోగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సదస్సును డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ ఆర్. వీరబాబు నిర్వహిస్తున్నారు. ఇతర సమాచారం కోసం డాక్టర్ అజయ్ కుమార్ 88266 99667 లేదా డాక్టర్ ఆర్. వీరబాబు 99665 78892లను సంప్రదించాలని, లేదా బి ఐ ఎస్ ఎస్2026ఏగీతం .ఇన్ కు ఈమెయిల్ చేయాలని సూచించారు.

# ప్రాజెక్టుల నిధుల సాధనకై ఆగష్టు 29,30తేదీలలో సిపిఎం పాదయాత్ర

### 31న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చెయ్యాలి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు



**మీడియా టుడే, ఆగస్టు28/ ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం శుక్రవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగష్టు 29,30,31తేదీలలో భువనగిరి అంబేద్కర్ చౌరస్తా నుండి హైదరాబాద్ ఇందిరాపార్కు వరకు పాదయాత్ర,31న ఇందిరా పార్కులో జరిగే మహాధర్నాలో రైతులు, వ్యవసాయం కార్మికులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు పిలుపు నిచ్చారు.శుక్రవారం గుండాల మండల కేంద్రంలో గోడ పత్రికలను పార్టీ మండల కమిటీ సభ్యులు,రైతులు, కూలీలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గుండాల మండలానికి సాగునీరు అందించే నవాబుపేట కాల్వ ప్రారంభించి దశబ్దాలు గడుస్తున్నా భూసేకరణ, నిర్వాసితులకు నష్ట పరిహారం ,కాల్వలు నిర్మాణం పూర్తి చేయడంలో వరుసగా పాలకులు విఫలమయ్యారని విమర్శించారు .పాలకులు మారుతున్నారే తప్ప,కాల్వ పూర్తిచేసి సాగునీరు అందించడంలో పాలకులు విఫలమౌతున్నారని అన్నారు. కాల్వల నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్,జిల్లా కలెక్టర్,చట్ట సభలకు ఎంపికైన ప్రజా ప్రతినిధులకు అనేక సార్లు వినతులు,పోరాటాలు నిర్వహించిన ఫలితంగా నిధులు విడుదల చేస్తునట్లు పత్రికా ప్రకటనలకు పరిమితం అయ్యారు తప్ప నిధులు విడుదల చేసి కాల్వ పనులను పూర్తిచేసి సాగునీరు అందించడంలో పాలకులు విఫలం మయ్యారని విమర్శించారు.సాగునీటి ప్రాజెక్టులు,కాల్వల పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భువనగిరి నుండి హైద్రాబాద్ ఇందిరాపార్క్ వరకు మూడు రోజుల పాటు 52 కిలో మీటర్ల పాదయాత్ర నిర్వహించి 31న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు రైతులు,అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చెయ్యాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు యండి ఖలీల్,బత్తిని బిక్షం, సాలమ్మ,స్వరూప మరికొందరు పాల్గొన్నారు.

## డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ

# పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

### అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్



**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి ఆగస్టు 28**

శుక్రవారం వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 19, 20, 8వ వార్డుల్లో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వార్డుల్లో నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది చేపడుతున్న డెంగ్యూ, మలేరియా నివారణ అవగాహన కార్యక్రమాలను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న సూచనలపై ఆరా తీశారు. అదేవిధంగా దోమల వృద్ధికి కారణమయ్యే ప్రదేశాలను గుర్తించి చేపడుతున్న యాంటీ లార్వా ఆపరేషన్లను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ అధికారులు, మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వృద్ధికి అవకాశం లేకుండా యాంటీ లార్వా చర్యలను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పాటిస్తూ డెంగ్యూ, మలేరియా నివారణలో ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్వో భాస్కర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, మున్సిపల్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పానుగల్ మండలంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం

**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి ఆగష్టు 28**

ప్రజలు తమ సమస్యలను రాత పూర్వకంగా రాసి వ్యాట్సాప్ లో పంపిన, మెయిల్ చేసిన ఆదికారులు స్పందించి పరిష్కరించాలిసాంకేతికత పెరిగిన ప్రస్తుత తరుణంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.. అధికారులు నిర్ణత గడువులోగా పరిష్కరించాలిపానగల్ మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో గత రెండున్నర సంవత్సరాల కాలములో ప్రజలు ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు సమర్పించిన ఫిర్యాదులు, పూర్తి అయిన పరిష్కారాలు... ఇంకా పెండింగ్ లో ఉన్న ఫిర్యాదుల పై రాష్ట్ర అబకారి, పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పానగల్ గ్రామ సభలో సమీక్ష. ప్రజలు తమ సమస్యలను రాత పూర్వకంగా రాసి వ్యాట్సాప్ లో పంపిన, మెయిల్ చేసిన ఆదికారులు వెంరానే స్పందించి ప్రింట్ తీసుకొని పరిష్కరించాలని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు ఆదేశించారు. శుక్రవారం పానగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగాణంలో పానగల్ మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో గత రెండున్నర సంవత్సరాల కాలములో ప్రజలు ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు సమర్పించిన తమ ఫిర్యాదులుఇప్పటి వరకు జరిగిన పరిష్కారాలు, ఇంకా పెండింగ్ లో ఉన్న ఫిర్యాదుల పై రాష్ట్ర అబ్కారీ , పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పానగల్ గ్రామ సభలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు నిత్యం తమ రోజువారి కార్యక్రమాల్లో బిజీగా ఉంటారని, తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాలకు ఇచ్చి నెలల తరబడి తమ పనులు వదిలిపెట్టి తిరగాల్సిన అవసరం ఉండొద్దని, అధికారుల్లో మార్పు రావాలని, వచ్చిన దరఖాస్తులకు గారిష్టంగా వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకారణ పత్రాలు రెండు మూడు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా రాసి తన చిరునామా, ఫోన్ నెంబర్ రాసి సంబంధిత శాఖధికారికి వ్యాట్సాప్ కానీ, మెయిల్ ద్వారా గాని పంపించుకోవచ్చని సూచించారు. అనంతరం ఇప్పటి వరకు పరిష్కారం కాకుండా పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులను జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, సంబంధిత శాఖల అద్జకారుల సమక్షంలో సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న చాలా సమస్యలను మంత్రి అక్కడికక్కడే అధికారుల ద్వారా పరిష్కరించారు. రెవెన్యూ సమస్యల పై ముందుగా సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారులు తమ భూసమస్యల పై ఇచ్చిన ఫిర్యాదును ఒక్కొక్కటిగా పరిశీలించి అధికారులకు పెండింగ్ కారణాలు అడిగి పరిష్కార మార్గాలు సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల పై సమీక్షిస్తూ కొల్లాపూర్ నియోజకవర్గంలోని ముడు మండలాలకు సంబంధించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి ఆర్థిక స్థోమత లేని కారణంగా ఇంకా నిర్మాణం పనులు ప్రారంభించని లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి ఇవవ్వాలని, వీరందరికి



తదుపరి సమీక్షా సమావేశంలో బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి నిర్మాణం ప్రారంభించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నాల్గవ విడత డబ్బులు మంజూరు. విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను మంత్రి సమీక్షించారు.ఈ సమీక్షా సమావేశంలో మరికొంత మంది ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా మంత్రికి అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు మండల స్థాయిలోనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్. ఖీమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డి. ఆర్. ఓ తిరుపతయ్య, తహసీల్దార్ కార్తిక్, ఎంపిడిఓ గోవిందా రావు, గ్రంధాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, పానగల్ సర్పంచ్ నాగలక్ష్మి, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి రాఖీ కట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్



**సూర్యాపేట, ఆగస్టు 28 (మీడియా టుడే):** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి రాఖీ కట్టి ఆత్మీయతను చాటుకున్నారు.ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మొరిశెట్టి నివేదిత లక్ష్మాది పరస్పరం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ కుటుంబ బంధాలు, ఆత్మీయత, ప్రేమానురాగాలను మరింత బలోపేతం చేస్తుందని వారు పేర్కొన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం మరింత పెరగాలని వారు ఆకాంక్షించారు.

## ఆధార్ సేవా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి.



**సూర్యాపేట, ఆగస్టు 28 (మీడియా టుడే):** జిల్లాలో ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు కావడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని డి-మార్ట్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సత్వర సేవలు అందించేందుకు కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కేంద్రం ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ సేవలకు సంబంధించి ప్రజలకు ఎదురయ్యే సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.ఆధార్ సేవా కేంద్రం ఇన్‌చార్జీలు, సిబ్బంది 24 గంటలు, వారంలో ఏడు రోజులు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండటం అభినందనీయమన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఈవైడీఐ డిప్యూటీ డైరెక్టర్ నాయిని రంగనాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, ఏడీఎం గఫార్, ఆపరేషన్ మేనేజర్ లాలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట పట్టణంలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు



**నర్సంపేట,ఆగష్టు 28(మీడియా టుడే )**

రాఖీ పండుగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సంపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆడబిడ్డలు, అన్నదమ్ములు రాఖీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.పట్టణంలోని వాకర్స్ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సదానందం ఆధ్వర్యంలో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.అదేవిధంగా నర్సంపేట ప్రాంతంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోనూ ఆడబిడ్డలు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధాన్ని చాటుకున్నారు. అన్నదమ్ములు తమ సోదరీమణులకు బహుమతులు అందించి, జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను నర్సంపేట ప్రాంత ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు.


## మహిళల సాధికారతకు కాంగ్రెస్‌పార్టీ అండ

### రక్షాబంధన్ వేడుకల్లో బండి రమేష్




**కూకట్‌పల్లి, ఆగస్టు 28 (మీడియా టుడే ప్రతినిధి)** కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి, సంక్షేమం కోసం తన వంతు సహకారం అందిస్తానని, పార్టీలకు అతీతంగా మహిళలకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలిచి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నపర్తిలో మాజీ సర్పంచ్ చేన్నా రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన మాజీ మంత్రి మాజీ ఎంపి



**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి ఆగస్టు 28**

వనపర్తి మండలం, చందాపూర్ గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ తండు చెన్నా రెడ్డి- సుజాత గార్ల ఆహ్వానం మేరకు వారి కుమారుడు రిసెప్షన్ ఆర్ జి గార్డెన్స్, వనపర్తిలో ఘనంగా జరిగింది.వంశీ కుమార్ రెడ్డి - భువిక రెడ్డి ల వివాహ రిసెప్షన్‌కు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ఉళ్లం తిరుమల్, నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, ధర్మ నాయక్, మాధవ రెడ్డి, చిట్యాల రాము, బాబు నాయక్, శ్యామలాలు యాదవ్, తోట శీను తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధానికి రక్షాబంధన్ సాక్ష్యం

**మహిళల గౌరవం, భద్రతే సమాజ ప్రగతికి పునాది: నీలం మధు**

**నీలం మధుకు రాఖీలు కట్టి అభిమానాన్ని చాటిన మహిళలు**



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 28 :**
అన్నాచెల్లెళ్ల ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు రక్షాబంధన్ పండుగ సాక్ష్యంగా నిలుస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం రాఖీ పండుగ ఉత్సవాలను పురస్కరించుకుని నీలం మధుకు పలువురు మహిళలు ఆయన నివాసంలో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేయగా, నీలం మధు వారికి మిఠాయిలు అందిస్తూ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, రక్షాబంధన్ భారతీయ సంస్కృతిలో ఎంతో పవిత్రమైన పండుగ అని, ఇది కేవలం ఒక దారాన్ని కట్టే సంప్రదాయం కాదని, పరస్పర విశ్వాసం, ఆత్మీయత, రక్షణకు ఇచ్చే మాటకు ప్రతీక అని అన్నారు. సమాజంలో ప్రతి మహిళ గౌరవంగా, భద్రంగా జీవించే వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి, సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, మహిళల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సోదరభావం, సామాజిక ఐక్యతను పెంపొందించే ఇలాంటి పండుగలు సమాజాన్ని మరింత దగ్గర చేస్తాయని అన్నారు.

# అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చొరవతో రజిత కు ప్రాణాపాయం తప్పింది

**మీడియా టుడే నాగర్ కర్నూలు జిల్లా ప్రతినిధి (ఆగస్టు 28):**



కుటుంబ కలహాల నేపథ్యంలో నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లు బావి గ్రామంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో భర్త కత్తితో దాడి చేయడంతో రజిత తీవ్రంగా గాయపడింది. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఆమెను అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగాస్థానిక డాక్టర్ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఎమ్మెల్యే నిత్యం వైద్యులతో మాట్లాడుతూ రజిత ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారు. ఉస్మానియా ఆసుపత్రిలో వైద్యులు సుమారు ఏడు గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి, ఎలాంటి ప్రాణాపాయం లేకుండా కవితను కాపాడారు. రజితకు మెరుగైన వైద్యం అందేలా చొరవ చూపి, అవసరమైన సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల కోసం 2 వేల కొత్త బ్యాంకు ఖాతాలు త్వరితగతిన ప్రారంభించాలి



**నిర్మల్ జిల్లా: ఖానాపూర్: (మీడియా టుడే) ఆగస్టు 28, 2026**
శుక్రవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి సంబంధించి ఉమ్మడి మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల పునరుద్ధరణ, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ అనుసంధానం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సుదీర్ఘంగా సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెస్ పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, ముద్రా, ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకాల అమలు, వాటికి సంబంధించిన సాంకేతిక మద్దతు విధానాలను బ్యాంకర్లకు, వివిధ శాఖల అధికారులకు సమగ్రంగా వివరించారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందే ఉపకార వేతనాలు సకాలంలో ఖాతాల్లో జమ అయ్యేలా చూసేందుకు బ్యాంక్ ఖాతాల ప్రారంభ ప్రక్రియను వేగవంతం చేయాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సుమారు రెండు వేల కొత్త బ్యాంక్ ఖాతాలను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులు, బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులతో రక్షాబంధన్ వేడుకల్లో

# పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, ఆగస్టు 28 (మీడియా టుడే):**



రాఖీ పౌర్ణమి సందర్భంగా దామరచర్ల మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుకుల విద్యార్థినులు ఎమ్మెల్యే కి రాఖీలు కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. విద్యార్థినుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రక్షాబంధన్ సందర్భంగా విద్యార్థినులకు కానుకగా పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం లక్ష యాభై వేల ఆర్థిక సహాయాన్ని పాఠశాలకు అందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు గురుకుల పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. రక్షా బంధన్ స్ఫూర్తి తో ప్రేమ, బాధ్యత, పరస్పర గౌరవం వంటి విలువలను పెంచుతూ అందరం కలిసి పనిచేయాలని అన్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని విద్యార్థినులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గూడెం వారింట రాఖీ పండుగ వేడుకలు

**ఎమ్మెల్యే జిఎంఆర్ కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేసిన సోదరిమణులు**



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 28 :**
సోదరి సోదరుల మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సంబరాలు గూడెం వారి ఇంట వెల్లి విరిశాయి. రాఖీ పండుగ పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నివాసానికి చేరుకున్న వారి సోదరీమణులు నర్సమ్మ, సువర్ణలు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో పాటు మరో సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిలకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు. వీరితోపాటు గూడెం మహిపాల్ రెడ్డి కుమార్తె కొలన్ రాజేశ్వరి రెడ్డి తమ సోదరుడు గూడెం విక్రం రెడ్డికి రాఖీ కట్టారు. కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి కుమార్తె రుధిర, గూడెం విక్రం రెడ్డి కుమార్తె మహిరలు వారి సోదరులు అక్షయ్ రెడ్డి, నిహాన్ రెడ్డి లకు రాఖీలు కట్టారు. కుటుంబమంతా రాఖీ పండుగ సంబరాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్కా చెల్లెలు, అక్క తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాల సూచికగా నిర్వహించుకుని గొప్ప పండుగ రాఖీ అని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# గతేడాది శ్రీశైలం బ్యారేజ్ నుంచి పరవాళ్ళు తొక్కుతున్న కృష్ణమ్మ.

**నేడు నేటికీ నిండని జలాశయం**




**మీడియా టుడే నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (ఆగస్టు 28):**
గత ఏడాది ఇదే నెలలో శ్రీశైలం డ్యామ్ కి వరద నీరు ఉధృతంగా వచ్చి డ్యామ్ నుండి గేట్లు ఎత్తి వదిలారు. ఈ ఏడాది నేటికీ జలాశయం నిండలేదు. టెలినోవో ప్రభావంతో శ్రీశైలం జలాశయంలో పూర్తి గా భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంకా తేడాది ఇదే సమయంలో 3.06 లక్షల క్యూసెక్కుల వరద నీటితో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కగా నేడు ఇన్ఫ్లో సున్నాగా నమోదయింది. గతంలో లక్షల క్యూసెక్కుల నీరు బయటికి వెళ్ళగా నేడు కేవలం 37,834 క్యూసెక్కులు మాత్రమే అవుట్ ఫ్లోగా ఉంది శ్రీశైలంలో ప్రస్తుతం 157.50 టిఎంసిల లభ్యత ఆధారంగానే దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు అధికారులు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో నూతన విద్యుత్ సవరణ చట్టం రద్దయ్యే వరకు పోరాడుదాం

**నాటి విద్యుత్ అమరవీరుల పోరాట ఫలితమే నేడు ఉచిత విద్యుత్ కరెంటు.**

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు.**




**మీడియా టుడే నాగర్కర్నూల్ జిల్లా ప్రతినిధి (ఆగస్టు 28):**
విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో నే డు తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేసే వరకు పోరాటం కొనసాగించాలని విద్యుత్ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విద్యుత్తు అమరవీరుల సంస్కరణ సందర్భంగా నాటి అమరవీరుల పోరాటాన్ని స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆనాటి పోరాట ఫలితమే నేటి ఉచిత విద్యుత్ కరంట్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28 నాడు హైదరాబాద్ నగరంలో విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి పోరాటం వృధా కాదని వారి యొక్క పోరాట స్ఫూర్తితో సాగించిన మహోజ్వల పోరాటంలో 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలపై భారాలు మోపకుండా వెనకడుగు వేశాయని, నాటి పోరాట ఫలితంగానే విద్యుత్ చార్జీలు పెంచాలంటే ప్రభుత్వాలు భయపడ్డాయని ఆయన అన్నారు. నాటి పోరాట ఫలితంగా విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని పెద్ద ఎత్తున వామపక్షాల ఆధ్వర్యంలో హైదరాబాదులోని బషీర్ బాగ్ వద్ద జరిగిన పోరాటంలో ఆనాటి అధికార టిడిపి ప్రభుత్వం కాల్పులు జరిపి ముగ్గురిని హతమార్చింది ఆనాటి పోరాటం వల్ల నేడు రైతులకు ఉచిత కరెంటు అమలైందని అన్నారు. అప్పటినుంచి విద్యుత్ చార్జీలు పెంచాలంటే ప్రభుత్వాలు భయపడేవి, కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అదే టిడిపి ప్రభుత్వం సహకారంతో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 2021 నూతన విద్యుత్ సవరణ బిల్లు తెచ్చి మళ్ళీ ప్రజలపై బారాలు మోపి కార్పొరేట్ సంస్థలు ఆదాని ,అంబానీల జేబులు నింపాలని చూస్తున్నారు . నూతన విద్యుత్ సవరణ బిల్లు తీసుకువచ్చి రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి ఉచిత కరెంటు దూరం చేయాలనే ఆడుతున్న నాటకం లో భాగంగానే ఈరోజు తీసుకు వచ్చిన నూతన విద్యుత్ సవరణ బిల్లు అని ఆయన అన్నారు 2000 సంవత్సరంలో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం దుర్మార్గంగా కర్కశంగా శాంతియుతంగా పోరాటం నిర్వహిస్తున్న ఉద్యమకారులపై విరుచుకుపడి రక్తాన్ని కళ్ళ చూసిన నాటి చంద్రబాబు నాయుడు నేడు మతతత్వ బిజెపి పార్టీతో కుమ్మక్కై నాటి ఎన్టీఆర్ లౌకికవాదాలను తుంగల తొక్కాడని ఆయన అన్నారు. ఇప్పుడు మాత్రం దేశానికి నరేంద్ర మోడీ మాత్రమే మార్పు తీసుకు రాగలరని మోడీకి డబ్బా కొడుతూ తిరుగుతున్నాడని ఆయన అన్నారు. మరొకవైపు సనాతన ధర్మం పేరుతో పవన్ కళ్యాణ్ మోడీ యొక్క మెప్పు పొందడానికి సినిమా నాటకాలు ఆడుతున్నాడని ఆయన అన్నారు. ఇప్పటికైనా విద్యుత్తు అమరవీరుల పోరాట స్ఫూర్తితో నూతన విద్యుత్తు సవరణ బిల్లు రద్దయ్యే వరకు పోరాడాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య, గుంపల్లి అశోక్, తారా సింగ్, నాయకులు మల్లికార్జున్, శివ, శ్రీనివాసులు చారి నిజాం, భాష, వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన కూకట్‌పల్లి ఏ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. రమాదేవి

**కూకట్‌పల్లి, ఆగస్టు 28 (మీడియా టుడే ప్రతినిధి)**



రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి కూకట్‌పల్లి నియోజకవర్గం ఏ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. రమాదేవి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మరింతగా పనిచేయాలని కోరుకుంటూ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్: వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్‌పల్లి, ఆగస్టు 28 (మీడియా టుడే ప్రతినిధి)**



రక్షాబంధన్ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన మహిళలు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసానికి చేరుకుని ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక అని అన్నారు. ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయత, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# కేంద్ర నూతన విద్యుత్ చట్టంతో తీవ్ర నష్టం

**రైతులపై భారాలు మోపే విద్యుత్ డిస్కంలను విరమించుకోవాలి**

**బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల 26వ వర్ధంతి కార్యక్రమంలో**

**ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**




**నర్సంపేట పట్టణం ఆగస్టు 28,మీడియా టుడే. ప్రతినిధి.**
ప్రజలపై భారాన్ని వేసి ప్రైవేటీకరించే ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెస్తున్న నూతన విద్యుత్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఎం సి పి ఐ యు నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బషీర్ భాగ్ విద్యుత్ అమరవీరులు రామకృష్ణ విష్ణువర్ధన్ రెడ్డి బాలస్వామిల 26వ వర్ధంతి సందర్భంగా వరంగల్ జిల్లా నర్సంపేట ఓంకార్ భవన్ లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమని విద్యుత్ ప్రైవేటీకరణ చార్జీల పెంపును నిరసిస్తూ 9 వామపక్ష పార్టీలు ఏకతాటిపైకి వచ్చి వీరోచితంగా పోరాడాయని ఈ క్రమంలో ఆగస్టు 28న చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే లక్షలాదిమంది ప్రజానీకం కదిలి అప్పటి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారని అందులో భాగంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో వందలాది మందికి గాయాలై ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని దాంతో దిగివచ్చిన ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవడమే కాకుండా ఇప్పటివరకు కరెంటు చార్జీలు పెంచలేదని అన్నారు. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నూతన విద్యుత్ చట్టం పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తూ విద్యుత్తును కేంద్రం పరిధిలోకి తీసుకొని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కుట్ర పన్నుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు అలాగే రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం డిస్కంల పేరుతో రైతులపై భారాలు మోపేందుకు ప్రయత్నిస్తుందని ఇలాంటి పరిస్థితుల్లో రైతాంగం ప్రజలు అప్రమత్తమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విద్యుత్తు విధానాలను నిరసిస్తూ బషీర్ బాగ్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం డివిజన్ నాయకులు మొర్రి శ్రీను భూమ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జానపద వేదికపై గానుగబండ ప్రతిభ

**సూర్యాపేటలో 'నవీన్ రాజ్ టీం'కు ఘన సత్కారం**



**గరిడేపల్లి, ఆగస్టు 28: మీడియా టుడే**
ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి జానపద కళా ప్రదర్శనల్లో గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామానికి చెందిన 'నవీన్ రాజ్ టీం' అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.?ఈ వేడుకల్లో భాగంగా కళాకారులు చింతల నవీన్ రాజ్, చింతల వీరబాబుల నాయకత్వంలో నవీన్ రాజ్ బృందం ప్రదర్శించిన జానపద రూపకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను, నిర్వాహకులను ఎంతగానో అలరించాయి. వీరి అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుంచు లింగన్న చేతుల మీదుగా బృంద సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపిక (మెమోంటో) మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు.?గానుగబండ గ్రామానికి చెందిన యువ కళాకారులు జిల్లా స్థాయిలో తమ ప్రతిభను చాటి గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం పట్ల గ్రామస్తులు, కళాభిమానులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ టీం జానపద కళారంగంలో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ పలువురు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు చింతల రాంబాబు, చింతల గోపి, కొండెబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ-అన్న చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక వేముల వీరేశం ఎమ్మెల్యే



నకిరేకల్ నియోజకవర్గప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,సోదర సోదరీమణుల మధ్య ప్రేమ,ఆప్యాయత, అనురాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి అని ఆయన అన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.కష్టాల్లో అండగా నిలబడతాననే భరోసా, సుఖాల్లో కలిసి ఆనందించాలనే ఆప్యాయత,ఎన్ని పరిస్థితులు ఎదురైనా ఒకరికొకరు తోడుగా ఉండాలనే నమ్మకమే రాఖీ పండుగ స్ఫూర్తి అని చిరు నవ్వుల కలల లక్ష్మి "ఆడపిల్లను కాపాడుకుందాం-అమ్మను పూజిద్దాం"అని ఆయన పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు జామే మజీద్ కమిటీ



**మణుగూరు,ఆగస్టు 28(మీడియా టుడే):**
జామే మజీద్ సదర్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.మొహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జామే మజీద్ జుమా నమాజ్ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు,మత పెద్దలు,చిన్నారులు మసీదు నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జెండాలు చేతబట్టి శాంతి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ,శాంతి, సోదరభావం, కరుణ,మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.యువత మద్యం,డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.సమాజంలో శాంతి,సోదరభావం నెలకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జామే మజీద్ సదర్ కమిటీ సభ్యులు ఎండి మోహినుద్దీన్,ఇస్మాయిల్,ఖాసీం,జావిద్,ముస్లిం మత పెద్దలు ముస్తఫా ,సిరాజ్ ,నూరుద్దీన్,కమారేఆలం తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.


## సెప్టెంబర్ 3న కామ్రేడ్ కామళ్ళ నవీన్ సంతాప సభ



**గరిడేపల్లి: ఆగస్టు 28: మీడియా టుడే**
ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ( ఐఎఫ్టియు ) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ కార్మిక నాయకుడు కామ్రేడ్ కామళ్ళ నవీన్ (49) ఇటీవల అనారోగ్యంతో (ఆగస్టు 22న) మరణించిన సందర్భంగా, ఈ నెల (సెప్టెంబర్) 3న గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో ఉదయం 11 గంటలకు సంతాప సభ నిర్వహించనున్నట్లు ఐఎఫ్టీయూ జిల్లా కమిటీ ప్రకటించింది.?పేద దళిత కుటుంబంలో జన్మించిన నవీన్, దాదాపు 29 ఏళ్లకు పైగా విప్లవ, కార్మిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. భవన నిర్మాణం, కేజీబీవీ, స్కావెంజర్స్, హమాలా కార్మికుల హక్కుల పోరాటాలతో పాటు గిరిజన సమస్యలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. కార్మికులకు రూ. 2 కోట్లకు పైగా సంక్షేమ ఫలాలను అందజేయడంలో కృషి చేశారు.?ఈ సంతాప సభలో కార్మికులు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ పిలుపునిచ్చింది. కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు పిట్టగణేష్, మత్స్య శాఖ చైర్మన్ చామకూరిదశరథ, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మాచర్ల రవి, మచ్చ నాగరాజు, బచ్చలకూరి నాగార్జున, చింతలచెరువు బాబు, పిట్ట నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రాఖీ బంధం


**మీడియా టుడే అచ్చంపేట (ఆగస్టు 28):**



నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేటలో అన్నాచెల్లెళ్ల ప్రేమ అనురాగాలకు మత సామరస్యానికి నిదర్శనంగా 20 ఏలుగా రాఖి అనుబంధం కొనసాగుతోంది. స్థానిక ఫౌండేషన్ చైర్మన్ షాజహాన్ బేగం విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర శర్మన్ సొంత అన్నగా భావిస్తూ గత రెండు దశాబ్దాలుగా రాఖీ కడుతున్నారు. అనాధ శరణాలయం నిర్వహిస్తూ సేవారంగంలో ఉన్న వీరి అనుబంధం కులమతాలకు అతీతమైన మానవత్వానికి ప్రతిగా నిలుస్తోంది.

## మార్కండేయ ఆలయంలో 46వ ఘనంగా నూలు పూర్ణిమ మహోత్సవం

**మీడియా టుడే అచ్చంపేట (ఆగస్టు 28):**



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలో గల మార్కండేయ శివాలయంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా 46 వ నూలు పూర్ణిమ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ శివాలయంలో ఉదయం 8 గంటలకు గాయత్రి ధారణ చేశారు. తర్వాత జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ సంవత్సరంలో జరిగిన అభివృద్ధి గురించి తెలియజేశారు. పద్మశాలి కుల బాంధవులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి పులిజాల రమేష్ , కోశాధికారి దాసు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పులిజాల యాదగిరి మ్యాకల సత్యనారాయణ, శివాలయ కమిటి అధ్యక్షులు వనం పర్వతాలు, మహిళ సంఘం అధ్యక్షురాలు దాసుపత్రి శకుంతల, గుర్రం హైమావతి, గుర్రం మల్లికార్జున్, గంజి రమేష్, పులిజాల భానుప్రసాద్ పాల్గొన్నారు.

# మోకుదెబ్బ పట్టణ అధ్యక్షుడిగా తాబేటి శ్రీనివాస్‌గౌడ్



**నర్సంపేట పట్టణం ఆగస్టు 28,మీడియా టుడే**
గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ అధ్యక్షుడిగా తాబేటి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం నర్సంపేటలో నిర్వహించిన మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశంలో ఈ నియామకాన్ని ప్రకటించారు.గీత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం గత కొన్నేళ్లుగా శ్రీనివాస్‌గౌడ్ చేస్తున్న కృషిని గుర్తించి పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు రమేష్‌గౌడ్ తెలిపారు. నియామకం జరిగిన నాటి నుంచి రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన గీత కార్మికులందరికీ ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గౌడ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.తనను మోకుదెబ్బ నర్సంపేట పట్టణ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్‌గౌడ్‌కు, తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు గొపగాని వెంకట్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్యగౌడ్, సలహాదారులు సొల్టీ సారయ్యగౌడ్, మచ్చిక రాజుగౌడ్, గోడిశాల మల్లయ్యగౌడ్, నర్సంపేట పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు గౌడ్, ఊడ్గుల శ్రీనివాస్‌గౌడ్‌లకు తాబేటి శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

# కోట మదన్ రాజ్‌కు రాఖీ కట్టిన సోదరి దీపిక

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 28 :**
నిజామాబాద్ వినాయక్ నగర్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే పవిత్రమైన ప్రేమానురాగాలకు, రక్షణకు ప్రతీక రక్షాబంధనని కోట మదన్ రాజ్, బారడ్ దీపిక అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని వినాయక్ నగర్ లో గల కోట మదన్ రాజ్ తమ నివాసంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోట మదన్ రాజ్ కుటుంబ సభ్యులు పట్టణ ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ అనగా రక్షణ కల్పించే పవిత్రమైన ముడి అని అర్థం, మన పురాణాల్లో రక్షాబంధన్ కు గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. శిశుపాలుడిని వధించే సమయంలో శ్రీకృష్ణుడి వేలికి గాయం కావడంతో ద్రౌపది వెంటనే తన చీర కొంగును చింపి కృష్ణుడి వేలికి కట్టింది. ఆ రక్షణ బంధానికి కృష్ణుడు సంతోషించి, ద్రౌపదికి ఎప్పుడూ అండగా ఉంటానని మాట ఇచ్చాడు. ఇలా ప్రత్యేకమైన



చరిత్ర కలిగిన పండుగ రాఖీ పండుగ అని అన్నారు. పట్టణ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల మధ్య రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ రక్షాబంధన్



కార్యక్రమంలో కోట మారుతి, కోట మదన్ రాజ్, కోట దీపిక, సోదరి బారడ్ దీపిక, ఆషిక, సిద్ధి, విరాజ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పల్లెర్లలో ఘనంగా 28వ విహెచ్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

### మంద కృష్ణ మాదిగ అన్న పోరాటంతోనే వికలాంగుల జీవితాల్లో వెలుగులు

### ముఖ్య అతిథి విఎచ్పిఎస్ జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ్య గౌడ్



**మీడియా టుడే, ఆగస్టు28/**
**ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:**
పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆలేరు నియోజకవర్గం పల్లెర్ల విహెచ్పిఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్య అతిథిగా వి ఎచ్ పి యస్ యాదాద్రి భువనగిరి జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ్య గౌడ్ హాజరై జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాటాల ఫలితం వికలాంగుల వితంతువు వృద్ధుల పెన్షన్లు పెరిగాయి. వికలాంగులకు పెన్షన్లు నాలుగువేల నుండి ఆరువేలకు వృద్ధుల వితంతువులు పెన్షన్ నలుగు వేలకు పెంచుతానని హామీ ఇచ్చి ఇప్పటివరకు వికలాంగుల గాన వితంతువుల గాని వృద్ధులకు గాని పెన్షన్ పెంచలేదు ఇవ్వలేదు ఇకనైనా వికలాంగుల వృద్ధులు వితంతువులకుపెన్షన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పియస్ ఆధ్వర్యంలో వి ఎచ్ పి యస్ జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ్య గౌడ్ కి మిఠాయిలు తినిపించడం జరిగింది. ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి భవిష్యత్ పోరాటల్లో వి ఎచ్ పి యస్ కు వెన్నుదన్నుగా ఎమ్మార్పియస్ ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ నల్ల చంద్ర స్వామి మాదిగ,వి ఎచ్ పియస్ నాయకులు గుంటి దామోదర్,తండ వెంకటేష్ ఎమ్మార్పియస్ నాయకులు మేడి రామ్ లక్ష్మణ్,జన్నపాల శేఖర్,కొమ్ము మత్స్యగిరి,కొమ్ము రాజు, ముత్తయ్య,వస్తుపుల జంగులు, మోత్కూర్ శేఖర్,మేడి రవి,జన్నపాల నరేష్,కొమ్ము సంతోష్,ఎడ్ల నవీన్,మేడి చరణ్,మేడి అర్జున్,ఎడ్ల శివకుమార్మోత్కూర్ నవీన్,వస్తుపుల నవీన్,కొమ్ము సంపత్, మేడి నగేష్,ఎడ్ల సంజీవ,మేడి ఆనంద్,వస్తుపుల పాపయ్య, మేడి నర్సింగ్ రావ్,ఎడ్ల సహదేవ్,వస్తుపుల మల్లేష్ , సంగపాక నవీన్ ,మేడి నర్సింహ్మా,తదితరులు పాల్గొన్నారు.

## సంబురంగా రాఖీ పౌర్ణమి

**నారాయణఖేడ్:**



ప్రేమానుబంధాల కలయిక అయిన రాఖీ పండగను నారాయణఖేడ్ నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా పండగ సంబురం కనిపిచిందిం. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న సోదరీమణులు రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని తమ సోదరుల గ్రామాలకు రాగా కొందరు సోదరులు తమ సోదరీమణులు ఉన్న గ్రామాలకు వెళ్ళి రాఖీలు కట్టించుకొన్నారు. చిన్నా, పెద్దా అన్న తేడాలు లేకుండా అందరూ సంబురంగా పండగను జరుపుకున్నారు. 28 ఎన్ఆర్కె 01ః నారాయణఖేడ్: సోదరులకు రాఖీ కడుతున్న సోదరీమణి

## రక్షాబంధన్ పేరుతో వృక్షాలకు రాఖీ కడుతున్న వన ప్రేమి

**వరంగల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28 (మీడియా టుడే):**



చెట్టు మనకి కర్రనిస్తుంది.. ఆక్సిజన్ ఇస్తుంది..నీడనిస్తుంది.. అలాంటి చెట్టుకి రక్షబంధన్ అనే పేరుతో చెల్లి తన అన్నకి ఎలాగా రక్ష కోసం రాఖి కడుతుందో మనం వృక్షాన్ని కూడా వృక్షాబంధన్ పేరుతోనే ఈ రక్షాబంధన్ కట్టాలనే ఉద్దేశంతోనే గత ఐదు సంవత్సరాలుగా వృక్షాలకు రాఖీ కడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన వన ప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి. చెల్లిని ఏ విధంగా ఆదరిస్తామో మొక్కల్ని కూడా ఆ విధంగా ఆదరించి వాటిని కూడా నీ చెల్లికి ఏ విధంగా ఆత్మీయ బంధాన్ని అందిస్తావో ఆ విధంగా అందించాలని ఉద్దేశంతోనే వృక్షాలకు రక్షాబంధన్ పేరుతోనే రాఖీలు కట్టడం జరుగుతున్నదని రామస్వామి తెలిపారు. ఇది ప్రతి ఒక్కరు సాంప్రదాయ బద్దంగా తమ చెల్లి తమ అన్న అనే ఒక సంస్కారాన్ని ఏర్పరుచుకోవాలని ఈ సందర్భంగా ఒక వనప్రేమిగా నేను ప్రతి ఒక్కరికి చెప్పడం జరుగుతుందని, చెప్పడమే కాకుండా వాటిని ఆలింగనం చేసుకుని చేసి చూపెట్టడం కూడా మన దర్మం కాబట్టి మరి ఆ అవకాశాన్ని మీరందరూ కూడా తీసుకోవాలని నేను కోరుకుంటున్నా ఇది మంచి సాంప్రదాయంగా కొనసాగించాలని రామస్వామి తెలిపారు.

## రాఖి పౌర్ణమి పురస్కరించుకొని పద్మశాలీలకు యజ్ఞోపవితాదరణ

**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,ఆగస్టు 28:రామన్నపేట,ప్రతినిధి**



రాఖీ పౌర్ణమినీ పురస్కరించుకొని శుక్రవారం పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలి కాలనీలో పద్మ బ్రాహ్మణుల చేత గణపతి పూజ,గాయత్రి మాత పూజ నిర్వహించి పద్మశాలీలకు యజ్ఞోపవితదారణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి,ప్రధాన కార్యదర్శి కైరంకొండ నాగభూషణ్, ఉపాధ్యక్షులు సురపల్లి యాదగిరి,నాయకులు జెల్ల వెంకటేష్,గంజి అశోక్,వనం అంబదాసు, దొంత సత్తయ్య,దొంత యాదగిరి,చిందం ఉమాకాంతం,చలమల్ల రమేష్,పద్మ బ్రాహ్మణులు కొంగరి నరసింహ, పసునూరి ధనుంజయ, పొట్ట బత్తిని రమేష్, ఏలూరు శీను,గంగుల మురళి,సూరపల్లి చంద్రమోహన్,జగన్, మధు,జెల్లా అశోక్,వనం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసి చైర్మన్ కుమారుడి దోతి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొర్రూర్,ఆగస్టు 28 (మీడియా టుడే)**



తొర్రూరు పట్టణంలోని అన్నారం రోడ్డులో ఉన్న బీఆర్ గార్డెన్ లో తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసి) చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి కుమారుడి దోతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి హాజరై వేడుకలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిరంజీవిని ఆశీర్వదించి, అతని భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అనుమాండ్ల తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## కార్మికులకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి!

**బోధన్ ఎమ్మెల్యే అనుచితవ్యాఖ్యలపై సీఐటీయూ ఆగ్రహం**

**చిన్నంబావిలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం**




**చిన్నంబావి, మీడియా టుడే న్యూస్ ఆగస్టు 28:**
గ్రామపంచాయతీ కార్మికులు, కారోబార్లపై బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. ఎమ్మెల్యే వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ?ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీఐటీయూ వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎన్.రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము మాట్లాడారు. ఈ నెల 24న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గ్రామపంచాయతీ కార్మికుల వల్లనే గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందని, వీళ్ల వల్లే గ్రామాలు చెడిపోతున్నాయని మాట్లాడటం దురదృష్టకరమన్నారు. 1981 నుంచే కారోబార్లు కేవలం రూ.100 నుంచి రూ.200 అతిస్వల్ప వేతనంతో గ్రామాల్లో రికార్డుల నిర్వహణ, పన్నుల వసూళ్లు, రెవెన్యూ సేవలు, ఇందిరమ్మ సర్వేలు, ఓటరు నమోదు వంటి కీలక బాధ్యతలను భుజన వేసుకున్నారని గుర్తుచేశారు. రాత్రింబవళ్లు శ్రమిస్తూ పల్లెల ప్రగతికి పునాదిగా నిలిచే శ్రామికులను అవమానించడం ఒక ప్రజాప్రతినిధికి తగదని హితవు పలికారు.
?ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పకపోయినా, అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోకపోయినా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వంపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు అక్తర్ పాషా, సీఐటీయూ నాయకులు మషయ్య, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన.. ఏ ఎంసి చైర్మన్ బండారు



**మీడియా టుడే ఎర్రుపాలెం:**
ఎర్రుపాలెం రైతు వేదిక లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు శుక్రవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, విద్యుత్తు, ప్రణాళిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు మేరకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు బండారు తెలిపారు. ఈ కార్డులను దుర్వినియోగం చేయకుండా లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, ఎర్రుపాలెం స్థానిక సర్పంచ్ నంద్రు అశ్విని, టిపిసిసి నాయకులు శీలం ప్రతాపరెడ్డి ,మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాసరెడ్డి, ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటాపురం సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు ,కిసాన్ సెల్ అధ్యక్షులు లక్ష్మీపురం సర్పంచి తల్లపురెడ్డి నాగిరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు కంచర్ల వెంకట నరసయ్య,గుడేటి బాబురావు,ఆత్మ కమిటీ డైరెక్టర్ షేక్ ఇస్మాయిల్, యూత్ కాంగ్రెస్ నాయకుడు దేవరకొండ రాజీవ్ గాంధీ, క్లస్టర్ ఇన్చార్జి శీలం వెంకటరామిరెడ్డి,ఎర్రిపాలెం వైస్ సర్పంచ్ షేక్ షా భాష తక్కలపాడు సర్పంచ్ ముక్కర్ రామకృష్ణారెడ్డి, రాజుపాలెం సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు కర్నాటి సుధాకర్ రెడ్డి, ఆర్ఐ రవికుమార్,జిపిఓ బాలయ్య ,గ్రామస్తులు రేషన్ కార్డు లబ్ధిదారులు మరియు తదితరులు పాల్గొన్నారు

## ప్రెస్ పేరుతో రైతును బెదిరించి రూ.5 వేల వసూళ్లు.. ఇద్దరు అరెస్ట్

**- నగదు, గుర్తింపు కార్డు, ద్విచక్ర వాహనం స్వాధీనం**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ప్రతినిధి మధు ఆగస్టు 28(మీడియా టుడే):**
మీడియా ప్రతినిధులమంటూ రైతును బెదిరించి రూ.5 వేల నగదు వసూలు చేసిన ఇద్దరిని అశ్వారావుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పండు కిరణ్ (29), సయ్యద్ జాన్ అజాద్ (39) నిందితులుగా గుర్తించారు.ఈ నెల 23/24వ తేదీ రాత్రి రామచంద్రాపురం ఎక్స్‌రోడ్డు సమీపంలో పొగాకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను నిందితులు అడ్డగించారు. తాము మీడియా ప్రతినిధులమని పరిచయం చేసుకుని, ట్రాక్టర్ డ్రైవర్‌ను బెదిరించి రూ.5 వేల నగదును బలవంతంగా తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.డయల్-112కు ఫోన్ చేసేందుకు డ్రైవర్ ప్రయత్నించగా, అతని సెల్‌ఫోన్‌ను లాక్కునేందుకు నిందితులు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. అనంతరం నగదు తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5 వేల నగదు, 'టి మీడియా' గుర్తింపు కార్డు, నేరానికి ఉపయోగించిన టీవీఎస్ స్టార్ సిటీ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.మీడియా పేరును దుర్వినియోగం చేస్తూ ప్రజలను బెదిరించడం, అక్రమంగా డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వారావుపేట పోలీసులు హెచ్చరించారు.

# పువ్వాడ ఉదయ నగర్‌లో ఇల్లు కూల్చివేత

**ఘటన వెనుక రౌడీ షీటర్లు - సర్పంచ్ అండదండలతోనే రెచ్చిపోయిన మూక**

**నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్- పలు సంఘాల నాయకుల ఆరోపణలు**



**ఖమ్మం, ఆగస్టు 28 :**
జిల్లా కేంద్రం కు అతి సమీపంలో గల రఘునాధపాలెం మండల పరిధిలోని పువ్వాడ ఉదయ్ నగర్ గ్రామంలో గురువను రాత్రి పేద లంబాడి గిరిజన మహిళ భూక్య నాగేంద్ర అనే మహిళ ఇంటిని కొందరు కూల్చి వేశారు. గురువారం ఉదయం సంఘటన స్థలానికి సందర్శించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుంతేటి వీరభద్రం , మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీను , బహుజన జెఏసి నాయకులు సంగమేశ్వర రావు , లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక పేద గిరిజన మహిళ ఇంటిని రాత్రిపూట ఎవరూ లేని సమయంలో కూల్చివేయటం దారుణమని విమర్శిస్తూ ఈ ఘటన వెనుక రౌడీ శీటర్లతోపాటు గంజాయి బ్యాచ్ ఉన్నట్లుఆరోపించారు. దీని వెనుక తనకు తాను సిపిఐ నాయకుడిగా ప్రకటించుకుంటున్న యాకోబ్, ఎలుక శివ , స్థానికుడు, మాజీ ఉప సర్పంచ్ భర్త వీరన్న , ప్రస్తుత సర్పంచ్ అనుచరులు ఇస్మాయిల్, వడ్లకుంట శివ మరి కొంతమంది ఈ ఇల్లు కూల్చివేతల్లో పాల్గొన్నట్లు స్థానికులు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారని తెలిపారు. అధికార పార్టీ కాంగ్రెస్ కు చెందిన పువ్వాడ ఉదయ నగర్ సర్పంచ్ సిద్దిక్ ప్రోబలం సహాయ సహకారాల కారణంగానే ఈ మూక ఈ దారుణానికి పొడిగట్టిందని ఆరోపించారు. గతంలో కూడా ఇదే విధమైన సంఘటన జరిగితే దీనిపై రఘునాధపాలెం పోలీస్ స్టేషన్లో , స్థానిక తాసిల్దారు కు కూడా ఫీ ర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కూల్చి వేసిన ఇంటిని పునర్ నిర్మించి, ఇంటిలోని సామాన్లను ధ్వంసం చేసిన దానికి నష్టపరిహారం నిందితులనుండే వసూలు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పువ్వాడ ఉదయ నగర్ లో తరచు సంభవించటం అక్కడి పరిపాలన వ్యవస్థను , అక్కడి శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. ఉన్నత అధికారులు ఇప్పటికైనా పువ్వాడ ఉదయ నగర్ పై దృష్టి సారించాలని , అక్కడి ప్లాట్ల క్రయవిక్రయాలపై సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఉదంతంపై జిల్లా కలెక్టర్ తో పాటు ఖమ్మం పోలీస్ కమిషనర్లకు సోమవారం పలు సంఘాల నాయకులు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి, పువ్వాడ ఉదయ నగర్ లో జరిగే పలు అంశాలపై ప్రశ్నించడం కారణంగా, నాగేంద్ర ఆమె బంధువు కావడం ఇల్లు కూల్చివేతకు మరో కారణం అంటూ వివరించారు. వ్యక్తిగత విషయాలలో ప్రతిష్టకు పోయి అమాయక, పేద లంబాడి మహిళ భూక్య నాగేంద్ర ఇల్లు కూల్చివేతకు సిద్ధమైన వీరిని వెంటనే అరెస్టు చేయాలని, వీరందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నల్ల నాగమణి, ఏ. సరోజిని,వినోద, జక్కం స్వాతి బీ..సుశీల తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో భగ్గుమన్న ఉద్రిక్తత

**సామాన్యుడి ఉపాధి ధ్వంసం, మహిళలు, జర్నలిస్టులపై పోలీసుల దౌర్జన్యం!**

**యాదవ బజార్‌లో అర్ధరాత్రి దౌర్జన్యంగా పాన్ షాప్ తొలగింపు..**

**కక్షసాధింపు చర్యలేనంటూ విపక్షాలు, స్థానికుల ఆగ్రహం**

**న్యాయం కోరిన మహిళలు, స్థానిక నేత మాదాల ఉపేందర్‌పై పోలీసుల రాక్షస దాడి..**

**బూటు కాళ్లతో తన్నారంటూ బాధితుల ఆవేదన**

**వార్త సేకరణకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై భౌతిక దాడి, మోచేత్తో గుద్దుతూ దౌర్జన్యం.**

**పత్రికా స్వేచ్ఛపై తీవ్ర దాడి అంటూ జర్నలిస్టుల నిరసన**



**కోదాడ, ఆగస్టు 28 (మీడియా టుడే)–:**
చట్టాన్ని కాపాడాల్సిన ఖాకీలే స్వయంగా శాంతిభద్రతలను అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కోదాడలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. అధికార పార్టీ నేతల కక్షసాధింపు రాజకీయాలకు అనుకూలంగా కోదాడ టౌన్ సీఐ శివశంకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు, బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తుంగలో తొక్కి సామాన్యుల పొట్టకొట్టడమే కాకుండా, ప్రశ్నించిన వారిపై పోలీసులు సాగించిన అణచివేతపై పట్టణంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

**అర్ధరాత్రి హైడ్రామా.. 25 ఏళ్ల ఉపాధిపై దెబ్బ**
కోదాడ పట్టణంలోని యాదవ బజార్‌లో గత పాతికేళ్లుగా చిన్న పాన్ డబ్బా కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబంపై మున్సిపల్, పోలీసు అధికారులు కక్షపూరితంగా వ్యవహరించారు. రాత్రికి రాత్రి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆ కొట్టును అక్రమంగా తరలించారు. దీనివెనుక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, రాజకీయ కక్షసాధింపు కోణమే ప్రధానంగా ఉందని స్థానికులు బలంగా ఆరోపిస్తున్నారు.

**మహిళలు, నిరసనకారులపై విచక్షణారహిత దాడి**
ఈ అన్యాయాన్ని ప్రశ్నించడానికి, ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపడానికి వెళ్లిన స్థానికులు, మహిళల పట్ల పోలీసులు అత్యంత దురుసుగా ప్రవర్తించారు. అడ్డువచ్చిన మహిళలని కూడా చూడకుండా దౌర్జన్యానికి దిగారు. ఇదే సమయంలో నిరసన తెలుపుతున్న స్థానిక నాయకుడు మాదాల ఉపేందర్‌ను బలవంతంగా అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు బూటు కాళ్లతో తన్నుతూ, అత్యంత పాశవికంగా భౌతిక దాడికి పాల్పడ్డారని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జర్నలిస్టుల విధులకు ఆటంకం.. మోచేత్తో గుద్దుతూ దౌర్జన్యం**
పోలీసుల ఈ అక్రమ దౌర్జన్యాలను, స్థానికుల నిరసనలను రికార్డు చేయడానికి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై సీఐ శివ శంకర్ స్వయంగా రంగంలోకి దిగి దాడికి పాల్పడ్డారు. విధుల్లో ఉన్న జర్నలిస్టులను అడ్డుకుంటూ కెమెరాలు లాక్కోవాలని ప్రయత్నించడమే కాకుండా, మోచేత్తో గట్టిగా గుద్దుతూ దురుసుగా ప్రవర్తించారు. పత్రికా స్వేచ్ఛను కాలరాసే విధంగా ఖాకీలు ప్రదర్శించిన ఈ అహంకారపూరిత ధోరణిపై జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

**శాంతిభద్రతల వైఫల్యంపై సర్వత్రా విమర్శలు**
పోలీసు వ్యవస్థను అధికార పార్టీకి దాసోహం చేసి, సామాన్యుల గొంతు నొక్కాలని చూస్తున్న ఈ అప్రజాస్వామిక విధానాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలపై, జర్నలిస్టులపై దాడులు చేస్తున్న అధికారులపై నిష్పక్షపాత విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో కోరుతున్నాయి.

# వైభవంగా మరు ద్వజ మధ్యలమ్మ బోనాల పండుగ



యాదాద్రి భువనగిరి జిల్లా

**మీడియా టుడే,ఆగస్టు 28:రామన్నపేట,ప్రతినిధి**
సిరిపురం గ్రామంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా మరియు మరుద్వజ (మద్దెలమ్మ ) బోనాల పండుగ అత్యంత వైభవంగా జరిగిన ఉదయం శివ భక్త మార్కండేయ దేవస్థానం లో రుద్రాభిషేకం గాయత్రి హోమం మరియు యజ్ఞోపవీతం (జంధ్యాలు) ఉచితంగా దేవస్థానంలో పద్మశాలి భక్తులకు వేయడం జరిగినది.అనంతరం స్టాండుమొగ్గం పై చీర నేసుకుంటూ ర్యాలీగా బయలుదేరి డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలు తీసుకొని భజన పాటలు ఊరేగింపుగా శివ సత్తులు నాట్యాలతో మద్దెలమ్మ అమ్మవారికి బోనం చీర సమర్పించినారు. అనంతరం సిరిపురం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి దాతలు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం పద్మశాలి సంఘం అధ్యక్షులు జెల్లా శ్రీనివాసు,ఉపాధ్యక్షులు పున్న వెంకటేశం,ప్రధాన కార్యదర్శి రాపోలు రమేష్,సహాయ కార్యదర్శి అప్పం సత్యనారాయణ, కోశాధికారి కొంగర సుదర్శన్,కార్యవర్గ సభ్యులు ఐటిపాముల రంగయ్య,గంజి రామకృష్ణ,రాపోలు సత్యనారాయణ,కొంగరి సత్యనారాయణ, మార్కండేయ స్వామి, దేవస్థానం అధ్యక్షుడు రాపోలు విశ్వనాథం, కార్యదర్శి అప్పం శ్రీనివాస్,గ్రామ ఉపసర్పంచ్ మూడు గుడ్ల అనుష రమేష్,సిరిపురం చేనేతసహకార సంఘం అధ్యక్షులు రాపోలు షణ్ముఖం, ఉపాధ్యక్షులు భారత మృత్యుంజయ,ప్రధాన కార్యదర్శి అప్పం తిరుమలయ్య, కోశాధికారి పున్న అమరేందర్,గుండు శాంతి కుమార్,మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం,బడుగు రమేశ్,మాజీ సర్పంచ్ మిర్యాల భాస్కర్,అప్పం లక్ష్మీ నర్స్, రామాలయం మాజీ చైర్మన్ రాపోలు స్వామి, పున్న శ్రవణ్ కుమార్, జెల్లా లక్ష్మీనారాయణ,ఏలే నరసింహ,మిరియాల రామలింగం ,అప్పం లక్ష్మీ నరసయ్య,అప్పం గణపతి పాల్గొన్నారు.

# కాల్వల మరమ్మతులకు రూ. 31 కోట్లుత్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభం

**టెండర్ల అనంతరం 9 నెలల్లో పనులు పూర్తి -రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు**

**ఇరిగేషన్ శాఖ సీఈ ధర్మ - అధికారులతో కలిసి సరస్సు కాల్వల పరిశీలన**



**భూపాలపల్లి/ గణపురం మీడియా టుడే ఆగస్టు 28**
కాకతీయులు నిర్మించిన గణప సముద్రం సరస్సు కాలువల మరమ్మతులకు ప్రభుత్వం రూ. 31 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మ తెలిపారు. శుక్రవారం ఆయన సరస్సు ఆయకట్టు కాలువలను జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మత్తడి కాలువ, కొత్త కాలువ, కోట కాలువ, పైడి కాలువలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే ప్రత్యేకంగా పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందేందుకు కాల్వల మరమ్మతు పనులు ప్రారంభిస్తామని అన్నారు. మరో పది రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని 9 నెలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయనున్నట్లు సి ధర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈ ఈ, రాము, ఎస్ సి మోహన్ రావు, ఏఈలు సమ్మారావు శ్రీనివాస్, గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్,మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, దూలం కుమారస్వామి గౌడ్, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు గంధం ఓదాకర్, పచ్చిమట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు

# సీఎం రేవంత్ రెడ్డి కి రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, (మీడియా టుడే):**
రాఖీ పండుగ పురస్కరించుకుని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రపంచవ్యాప్తంగా రాఖీ పండుగను జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాదులో జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం కడుతున్నట్లే ఈ సంవత్సరం కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తాను రాఖీ కట్టినట్లు మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా మూడోసారి రాఖీ కట్టడం జరిగిందని, గత మూడు సంవత్సరాలుగా రాఖీ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రికి, వారి మనవడికి కూడా రాఖీ కడుతున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై రాష్ట్రంలోని ఆడపడుచులందరి దీవెనలు, ఆశీస్సులు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజలకు మంచి సుపరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రి కి మరింత శక్తి, యుక్తి కలగాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీర్వాదాలు కూడా తెలంగాణలోని ఆడపడుచులందరిపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. తాను తెలంగాణ ఆడపడుచునని, తెలంగాణలోని ప్రతి కుటుంబం తనను వారి కుటుంబ సభ్యురాలిగా ఆదరిస్తుందని మంత్రి సురేఖ తెలిపారు. అందరి ఆడపడుచుల తరఫున ఈ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని కోరుకుంటున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు.

# నేపాల్ వరద బాధితుల కోసం కోదాడలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

### పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో భారంతో ఉపవాస ప్రార్థనలు




**కోదాడ, ఆగస్టు 28 (మీడియా టుడే)-:**
నేపాల్ దేశంలో ఇటీవల సంభవించిన భీకర ఆకస్మిక వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఓదార్పు కలగాలని, గల్లంతైన వారు క్షేమంగా బయటపడాలని, బాధితులకు సహాయక చర్యలు వేగవంతం కావాలని కోరుతూ కోదాడ పట్టణ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.కోదాడ పట్టణ క్రైస్తవ నాయకులు పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు నిర్వహించగా, మహిళలు ఉపవాసముండి ప్రత్యేక భారంతో నేపాల్ ప్రజల కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా పాస్టర్ యేసయ్య మాట్లాడుతూ,"నేపాల్‌లో సంభవించిన ఈ విపత్తు ఎంతో బాధాకరమైనది. వరదల కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడం, అనేక కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోవడం హృదయాన్ని కలచివేస్తోంది. ఆ దృశ్యాలు చూస్తుంటే మనసు ఎంతో వేదనకు గురవుతోంది. మనం నేరుగా అక్కడికి వెళ్లి సహాయం చేయలేకపోయినా, మన ప్రార్థనల ద్వారా వారి బాధలో భాగస్వాములం కావచ్చు" అని అన్నారు."బాధిత కుటుంబాలకు దేవుడు ధైర్యాన్ని ఇవ్వాలని, గల్లంతైనవారు సురక్షితంగా తిరిగి రావాలని, సహాయక బృందాలకు జ్ఞానం మరియు శక్తిని ఇవ్వాలని, నేపాల్ దేశంపై మరింత విపత్తు రాకుండా దేవుడు కాపాడాలని ప్రార్థిస్తున్నాం" అని పాస్టర్ యేసయ్య తెలిపారు.నేపాల్‌లో ఆగస్టు 26న సంభవించిన భీకర వరదలతో ఇళ్లు, రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాజా అధికారిక నివేదికల ప్రకారం వందలాది మంది ప్రాణాలు కోల్పోగా, ఇంకా అనేక మంది గల్లంతయ్యారు. ప్రార్థనలో పాల్గొన్నవారుప్రార్థన కార్యక్రమంలో కోదాడ మిన్సిపాలిటీ మాజీ కోఆప్షన్ సభ్యులు శ్రీమతి వంటెపాక జానకి యేసయ్య, పాస్టర్ శ్రీనివాస్ గౌడ్, పాస్టర్ ప్రభుదాస్, గురునాథ్, సుధా జ్యోతి, సరిత, సీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

# కౌడిపల్లిలో ఘనంగా మిలాద్-ఉన్-నబీ ర్యాలీ



**మీడియా టుడే ఆగస్టు 28**
కౌడిపల్లి మండలంలో మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఈరోజు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ వారి జీవితం, బోధనలు మరియు మానవత్వం గురించి గుర్తుచేసుకున్నారు. ప్రవక్త ప్రేమ, దయ, క్షమ, నిజాయితీ, పేదల పట్ల కరుణ, పొరుగువారితో మంచిగా మెలగడం, సమాజంలో శాంతి మరియు సోదరభావాన్ని పెంపొందించడం వంటి గొప్ప సందేశాలను అందించారు.ప్రవక్త చూపిన సత్యం, శాంతి, మానవత్వం మరియు సోదరభావం మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమం శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్ భాయ్. రసూల్ ఖాజీ సలావుద్దీన్ గౌస్ పాషా మినహాజ్ ఇలియాస్ ఫక్రుద్దీన్ మక్బూల్ యాదుల్ గ్రామ యువకులు పెద్దలు పాల్గొన్నారు

# పద్మశాలీల ఆధ్వర్యంలో గాయత్రీ ధారణ



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 28 :**
పటాన్ చెరు నియోజకవర్గం రామచంద్రాపురం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సాయి కాలనీలో గల శ్రీ సాయిబాబా మందిరంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా గాయత్రీ ధారణ చేపట్టారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు తడుక నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుల బాంధవులు పాల్గొని మార్కండేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గాయత్రి మంత్రాలు, ధారణ, రాఖీలు కట్టే కార్యక్రమం చేపట్టారు. ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో గాయత్రి ధారణ మరియు పూజలు చేపడుతున్నట్లు సంఘం అధ్యక్షులు తెలిపారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

### వెల్లివిరిసిన ప్రేమానురాగాలు



**తొర్రూరు, ఆగస్ట్ 28 (మీడియా టుడే )**
తొర్రూరు డివిజన్ కేంద్రంతో సహా డివిజన్ పరిధిలోని పలు మండలాలు గ్రామాల్లో శుక్రవారం నాడు రక్షాబంధన్ పర్వదిన వేడుకలను ప్రజలు సంప్రదాయబద్ధంగా, అత్యంత ఆనందోత్సాహాలతో, ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకైన రాఖీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం నాడు డివిజన్ వ్యాప్తంగా ప్రతి ఇంట్లో పండుగ వాతావరణంతో కూడిన ఆనందోత్సాహాలు, ప్రేమానురాగాలు వెల్లివిరిసాయి. రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుండే అక్క చెల్లెల్లు తమ సోదరులకు రాఖీలు కట్టి వారు ఆయురారోగ్యాలతో , అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో తులతూగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందజేశారు. రాఖీ పండుగ సందర్భంగా తమ తమ సోదరులకు రాఖీలు కట్టి వారు కలకాలం తమకు రక్షగా ఉండాలని ఆడపడుచులు ఆకాంక్షించారు.తమకు రాఖీలు కట్టిన సోదరీమణులకు సోదరులు తమ శక్తి మేరకు బహుమతులు, కానుకలు అందజేసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కలకాలం వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు .రాఖీ, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంద్యాల పూర్ణిమ అని కూడా పిలుస్తారు.అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. అన్నకుగాని తమ్ముడికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రాధాన్య విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ.

# చేనేత కార్మికుల చేయూత పింఛన్ల దరఖాస్తు గడువు పెంచాలి

### తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్



**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,ఆగస్టు 28: రామన్నపేట,ప్రతినిధి**
50 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గల చేనేత కార్మికుల చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 30తో ముగుస్తున్నందున గడువును పొడిగించాలని, నిబంధనలను సరళీకరించాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం గడువును పెంచాలని నిబంధనలు సకరించాలని కోరుతూ చేనేత జౌళి శాఖ రాష్ట్ర కార్యాలయంలోనూ, ఆన్లైన్లో ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సమాజంలోని వివిధ వర్గాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ,సామాజిక భద్రతా పథకాలు విస్తృత ప్రశంసలు, ప్రజా మద్దతును పొందాయన్నారు.50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు చేయూత పింఛన్లు అందించాలన్న మీ ప్రభుత్వ నిర్ణయాన్ని మేము ప్రత్యేకంగా స్వాగతిస్తున్నామన్నారు.తెలంగాణ వ్యాప్తంగా చేనేత సహకార సంఘాలలో సభ్యులుగా లేని,జియో-ట్యాగింగ్ వ్యవస్థ పరిధిలోకి రాని వేలాది మంది నిజమైన చేనేత కార్మికులు ఉన్నారన్నారు. అయినప్పటికీ,వారు చేనేత మగ్గాలపై చేనేత వస్త్రాలను నేయడంలో, ఉత్పత్తి చేయడంలో చురుకుగా నిమగ్నమై ఉన్నారు. తమ జీవనోపాధి కోసం పూర్తిగా ఈ సాంప్రదాయ వృత్తిపైనే ఆధారపడి ఉన్నారన్నారు. అటువంటి నిజమైన చేనేత కార్మికులకు కేవలం వారు సహకార సంఘాలలో సభ్యులు కానందువల్ల గానీ లేదా జియో-ట్యాగింగ్ వ్యవస్థ పరిధిలోకి రానందువల్ల గానీ వారికి చేయూత పింఛను ప్రయోజనం అందకుండా పోకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. చేయూత పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 30 వరకు నిర్ణయించారని, కొన్ని విధానాలు, అవసరాలకు సంబంధించి స్పష్టత లేకపోవడం వల్ల, చేనేత కార్మికులు, క్షేత్రస్థాయి అధికారులలో గణనీయమైన గందరగోళం నెలకొంది అన్నారు.ఈ వారంలో చాలా రోజులు సెలవులు ఉండటం వల్ల చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోయారని అన్నారు. సహకార సంఘాలలో సభ్యత్వం, జియో ట్యాగింగ్ తో నిమిత్తం లేకుండా పెన్షన్ ఇవ్వాలని ఆయన కోరారు.ఆయన వెంట చేనేత ఐక్యవేదిక కోశాధికారి జెల్ల రఘు, రాపోలు రాజశేఖర్ కైరం కొండ నాగభూషణ్, తదితరులున్నారు.

# 22A నిషేధిత భూముల బాధితులకు అండగా బీఆర్ఎస్ పోరాటం

- కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు అవిశ్రాంత పోరాటం
- నిరసన గళం సభను విజయవంతం చేయండి..
- ముఖ్య అతిథిగా మాజీ మంత్రి శ్రీ తన్నీరు హరీష్ రావు..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 28 :**
22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన భూముల బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పటాన్చెరు కేంద్రంగా నిర్వహించనున్న నిరసన గళం సభను దిగ్విజయవంతం చేయాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. 22ఏ భూముల సమస్యపై బాధితుల పక్షాన నిలిచి, వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమం ఏర్పాట్లపై శుక్రవారం జిన్నారం, గుమ్మడిదల, పటాన్ చెరు మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, నాయకులు, కార్యకర్తలు, 22ఏ భూముల బాధితులను పెద్ద సంఖ్యలో తరలించే అంశాలపై చర్చించారు.ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో ఎలాంటి వివాదాలు లేని ప్రైవేట్, పట్టా భూములు, రిజిస్టర్డ్ ఇళ్లను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ జాబితాలో భూములు చేరడంతో ఆస్తులను విక్రయించుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక, తమ అవసరాలకు ఆస్తులను వినియోగించుకోలేక ప్రజలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.బాధితుల సమస్యను అడ్డుపెట్టుకుని దళారుల దందా22ఏ జాబితా నుంచి పేర్లు తొలగించిస్తామంటూ కొంతమంది బ్రోకర్లు, దళారులు బాధితులను లక్ష్యంగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. 30 శాతం వరకు కమీషన్లు డిమాండ్ చేస్తూ దందాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం.. వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు22ఏ నిషేధిత భూముల బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ భూముల సమస్యపై సరైన పరిష్కారం చూపే వరకు అవిశ్రాంతంగా పోరాటం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. పటాన్ చెరు లోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల బాధితులు భారీ సంఖ్యలో తరలివచ్చి నిరసన గళాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా రక్షబంధన్ వేడుకలు

### డీసీసీ అధ్యక్షుడు కరుణాకర్‌కు రాఖీ కట్టిన మహిళా నేతలు

**భూపాలపల్లి / మీడియా టుడేఆగస్టు 28**



భూపాలపల్లి రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ కు రాఖీ కట్టి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళల సమస్యల పరిష్కారంతో పాటు వారి గౌరవం, భద్రత, సాధికారత కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పట్టణ అధ్యక్షురాలు మాలతి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, జిల్లా కార్యదర్శి కోమల, కో-ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్ శారద, మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు కమల, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కమల, మహిళా కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# చెంజర్లలో ట్రాక్టర్‌పై మగ్గం నేత

### రాఖీ పౌర్ణమి వేళ పద్మశాలీల సంప్రదాయ కార్యక్రమం



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాప్ రిపోర్టర్ : మీడియా టుడే , ఆగస్టు 28**
రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు నిర్వహించే సంప్రదాయ ఆచారంలో భాగంగా ట్రాక్టర్‌పై మగ్గం నేత కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.పద్మశాలీల వృత్తి, సంప్రదాయానికి ప్రతీకగా మగ్గాన్ని ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి నేత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పద్మశాలీలు సంప్రదాయ వస్త్రాలు, కండువాలు ధరించి మగ్గం నేసే కార్యక్రమాన్ని చేపట్టారు. తమ కులవృత్తి, చేనేత సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది..ఈ కార్యక్రమం గ్రామంలోని ప్రధాన వీదులగుం డా గుట్టపై వెలసిన శివాలయం వరకు సాగింది. ట్రాక్టర్ పై అమర్చిన మగ్గంతో నేచిన వస్త్రాలను గ్రామంలోని హనుమాన్ గుడి, శివాలయం, గుట్ట శివాలయం లో దేవతా మూర్తులకు సమర్పించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లెన కొమరమ్మ కొమురయ్య, ఉప సర్పంచ్ గడ్డి గణేష్, వార్డు సభ్యులు పద్మశాలి సంఘం నాయకులు ఎలగం రాజయ్య, భైరి వెంకటయ్య, ఎల్లయ్య రమేష్, రాములు, ఒడ్నాల ఓదెలు,సదానందం,మార్కండేయ ,బొలబత్తుల ఆంజనేయులు,ం-రాజు,గంగుల వెంకటేశ్వర్లు, వాసాల తిరుపతి, బాసబత్తుల వివేక్,రాజేశం, సంపత్, శ్రీరాముల భూమయ్య, నర్సయ్య,ఆడెపు కుమార్, సంపత్,రాజు, లక్ష్మీరాజం,దాసరి కొమురెల్లి, పనస సంపత్, రామ్మూర్తి, సుధాకర్,చంద్రాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ అనురాగాలకు ప్రతీక రాఖీ పండుగ


## భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు



**గజ్వేల్ ఆగష్టు 28మీడియా టూ డే**
రాఖీ పండుగ సోదర, సోదరీల మధ్య ఉన్న పవిత్రమైన ప్రేమానుబంధానికి ప్రతీక అని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అన్నారు. రాఖీ అనేది మణికట్టుకు కట్టే దారం మాత్రమే కాదని, సోదరుడి సుఖసంతోషాలను కోరుతూ సోదరి కట్టే ప్రేమబంధం, ఆప్యాయతకు ప్రతిరూపమని తెలిపారు. సోదరి కట్టే రాఖీలో ప్రేమ, ఆత్మీయత ఉంటే సోదరుడి ఆశీస్సుల్లో భరోసా, అనురాగం ఉంటాయని అన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ, జీవితంలో ఎన్ని మార్పులు వచ్చినా సోదర, సోదరీల బంధం ఎప్పటికీ చెదరని అనుబంధమని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, అక్షింతలు వేసి ఆశీర్వదించి, హారతి ఇచ్చి స్వీట్లు తినిపించుకోవడం భారతీయ కుటుంబ విలువలకు అద్దం పడుతుందని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో రక్షాబంధనానికి ఎంతో విశిష్టమైన స్థానం ఉందని, ఈ పండుగ కుటుంబాల్లో ప్రేమ, ఐక్యత పరస్పర గౌరవాన్ని మరింత పెంపొందిస్తుందని రామకోటి రామరాజు అన్నారు. రాఖీ బంధం ప్రతి ఇంటా ప్రేమను పంచాలి ప్రతి హృదయంలో ఆత్మీయతను నింపాలి.. సోదర, సోదరీల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు.


# చిన్నంబావి మండల కేంద్రంలోసీసీ కెమెరాలకు అడ్డంగా కటౌట్

## -చిన్నంబావిలో నిఘా వ్యవస్థకు ఆటంకం ప్రజల్లో ఆందోళన




**చిన్నంబావి మీడియా టు డే న్యూస్ ఆగస్టు 28**
చిన్నంబావి మండల కేంద్రంలో ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు కటౌట్ అడ్డుగా మారింది. మండల కేంద్రంలోని రెండు సీసీ కెమెరాల దృశ్య పరిధిని కటౌట్ పూర్తిగా అడ్డుకోవడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.వారం రోజుల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లలో భాగంగా ఈ పరిస్థితి ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కార్యక్రమం ముగిసినా కటౌట్ తొలగించకపోవడంతో సీసీ కెమెరాల నిఘాకు అంతరాయం కలుగుతోందని అంటున్నారు.ఒక్క సీసీ కెమెరా వంద మంది మనుషులతో సమానం అన్నంతగా నిఘా వ్యవస్థ ప్రాధాన్యం కలిగి ఉంది. చిన్నంబావి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలకు చోరీలు, ఇతర అవాంఛనీయ ఘటనల సమయంలో సీసీ కెమెరాలు భద్రతగా నిలుస్తున్నాయి. అయితే ప్రస్తుతం కెమెరాల ముందు కటౌట్ అడ్డుగా ఉండటంతో నిఘా వ్యవస్థ ప్రయోజనం ఏమేరకు ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కటౌట్ కారణంగా సీసీ కెమెరాల పరిధిలోని దృశ్యాలు కనిపించకపోతే.. ఏదైనా చోరీ లేదా అవాంఛనీయ ఘటన జరిగితే బాధ్యత ఎవరిది? అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సీసీ కెమెరాలకు అడ్డుగా ఉన్న కటౌట్‌ను తొలగించి, ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# వివాహ వేడుకలకు హాజరైన బిఆర్ఎస్ పార్టీ నాయకులు రంగినేని అభిలాష రావు



**మీడియా టుడే న్యూస్ చిన్నంబావి అగస్ 28**
చిన్నంబావి మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శానమోని బాలకృష్ణ ఆహ్వానం మేరకు శనమోని బాలకృష్ణ యాదవ్, శ్రీలతల వివాహ వేడుకలకు ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రంగనేని అభిలాష్ రావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ యాదవ్, శ్రీలతలకు వివాహ శుభాకాంక్షలు తెలిపిన అభిలాష రావు వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, రాజకీయ ప్రముఖులు వివాహ వేడుకల్లో పాల్గొన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని అభిలాష రావు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో రంగినేని అభిలాష రావు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నూతన దంపతులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి కుటుంబ సభ్యులను, ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు రాజకీయ నాయకులను, బంధుమిత్రులను, ఆప్యాయంగా పలకరిస్తూ అందరితో ముచ్చటిస్తూ సరదాగ గడిపారు.



# అమ్మాయి పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజనం గౌడ్

**మాజీ చైర్మన్ పెబ్బేటి రామచంద్రారెడ్డి**

**సీనియర్ నాయకులు జంగ బిచుపల్లి యాదవ్**

**కొప్పునూరు సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న**

**సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు పెబ్బేటి తేజరెడ్డి**

**మండల ఉపాధ్యక్షులు జ్యోతి గౌడ్**





**చిన్నంబావి మీడియా టుడే న్యూస్ ఆగస్టు 28**
చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన 1), పద్మమ్మ లక్ష్మయ్య గౌడ్ 2), లచ్చులమ్మ కృష్ణయ్య గౌడ్ ల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి పూజా కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి కి, మంత్రి జూపల్లి కృష్ణారావు కి, సర్పంచ్ కవిత ప్రబంజన్ గౌడ్ కి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు గ్రామ నాయకులు మాకు సహకరించి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాధవి మాధవ్ రెడ్డి, మోహన్ రెడ్డి, కార్యదర్శి జయపాల్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్, నరేష్ గౌడ్, ధర్గయ్య, అల్లెన్న గౌడ్, కవిందర్ గౌడ్, రామన్ గౌడ్, సుకుమార్, పబ్బ నరసింహా గౌడ్, మండ్ల శ్యాం కుమార్, బిట్టు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నలా నేను తోడుంటా

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం 5000/- రూపాయలు

## సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి మహేందర్ రెడ్డి



**జగదేవపూర్, ఆగస్టు 28 ,మీడియా టుడే**
తల్లిదండ్రులు లేకున్నా అన్నలా తోడు ఉంటానని సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి మహేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండలం దౌలపూర్ గ్రామానికి చెందిన కొలిప్యాక మల్లయ్య అనారోగ్యం తో మృతి చెందారు. శుక్రవారం మహేందర్ రెడ్డి మల్లయ్య కుమార్తెలను పరామర్శించి తల్లిదండ్రులు లేకున్నా తోడుగా ఉంటానని తెలిపి రూపాయలు 5000 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అయన వెంట గ్రామ సర్పంచ్ కుకునూరి కృష్ణ, వార్డు సభ్యులు అకారం నర్సింలు,పోకల ఐలయ్య, తదితరులు ఉన్నారు.

# రోడ్డుపై గుంతలను పూడ్చిన ఆటో యూనియన్ సభ్యులు



**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,ఆగస్టు 28: రామన్నపేట,ప్రతినిధి**
రామన్నపేట మండల కేంద్రం నుంచి అమ్మనబోలు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడడంతో శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానం నిర్వహించి గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ. అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి అని పేర్కొన్నారు.నిత్యం ఈ రహదారిలో వందల వాహనాలు తిరుగుతాయని అన్నారు. ప్రయాణం సాఫీగా సాగేందుకు రహదారి బాగుండాలని, గుంతల్లో మట్టి పోసి తాత్కాలికంగా పూడ్చామని తెలిపారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మత్తులు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు తుర్కపల్లి ఉప్పలయ్య, మేకల రాములు,కప్పుల రమేష్,గంటెపాక బిక్షం, లక్ష్మయ్య చారి,ఎండి మజ్జు,బొంగు బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ట వైభవంగా ప్రారంభం



**మర్కూక్ఆగష్టు 28మీడియా టూ డే**
సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ గోవిందాంబ సమేత విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా ప్రారంభమైంది.వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

# బషీర్బాగ్ విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

## ప్రజా ఉద్యమాలే అమరవీరులకు నిజమైన నివాళి: కన్నం వెంకన్న



**చెన్నారావుపేట,ఆగస్ట్ 28,మీడియా టుడే**
మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఎంసీపీఐయూ పార్టీ ఆధ్వర్యంలో బషీర్బాగ్ విద్యుత్ అమరవీరుల 26వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి జన్ను రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కన్నం వెంకన్న మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ప్రజల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామి త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రజా ఉద్యమాన్ని అణచివేసేందుకు అప్పట్లో బాష్పవాయువు, వాటర్‌క్యానన్లు, ఇనుప కంచెలు, తుపాకులతో పోలీసులు ఎదురైనా ఉద్యమకారులు వెనుకడుగు వేయలేదన్నారు.అమరవీరుల త్యాగస్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పల్లెపల్లె నుంచి ప్రజలు ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. బషీర్బాగ్ అమరవీరుల ఆశయాలను కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి అబ్బదాసి అశోక్,మొర్రి శ్రీను,సాంబయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండలో ఫేమస్ బేకరీ ని ప్రారంభించిన సర్పంచ్ : కుంభం వెంకట పాపిరెడ్డి



**మీడియా టుడే వలిగొండ ఆగష్టు : 28**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో శుక్రవారం రోజు సాయంత్రం ఫేమస్ బేకరీ ని కేరళ కు చెందిన యజమాని ఇబ్రహీం స్థాపించిన ఫేమస్ బేకరిని వలిగొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి నూతన ఫేమస్ బేకరీ ని ప్రారంభించారు. అనంతరం ఫేమస్ బేకరీ లో తయారు చేసే వివిధ రకాల కేకులను ఎగ్ పప్పు కర్రీ పప్పు జ్యూస్ బ్రెడ్ బిస్కెట్స్ చాక్లెట్స్ బర్గర్స్ ఇంపోర్టెడ్ చాక్లెట్లు తదితర ఐటెం లను మా బేకరీ ద్వారా వినియోగదారులకు విక్రయిస్తామని బేకరీలో తయారైన ఐటెం లు సరసమైన ధరలకు వినియోదారులకు లభించునని ఫేమస్ బేకరీ ప్రారంభించిన యజమాని ఇబ్రహీం ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బడుగు సత్యనారాయణ ఎండి షరీఫ్ బాలా చారి నాయకులుతదితరులు పాల్గొన్నారు.

# సూర్యతండాలో ఘనంగా తీజ్ వేడుకలు



**గీసుకొండ మండలం ఆగష్టు 28, మీడియా టుడే ప్రతినిధి**
వరంగల్ జిల్లా గీసుకొండ మండలం సూర్యతండా గ్రామపంచాయతీ పరిధిలో తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ సందర్భంగా తండా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలకు జిల్లా నాయకులు, రాంపూర్ గ్రామ సర్పంచ్ రడం భరత్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తీజ్ పండుగ విశిష్టతను, బంజారా సంస్కృతి, సంప్రదాయాల్లో దాని ప్రాధాన్యాన్ని తెలుసుకున్నారు. తండా ప్రజలతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం తీజ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన సూర్యతండా సర్పంచ్ బానోతు రాఘవేంద్రను అభినందించారు.కార్యక్రమంలో మనుగొండ సర్పంచ్ పేర్ల శ్రవణ్, గ్రామ పెద్దలు, తండా ప్రజలు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు తప్పనిసరిగా డిజిటల్ క్రాప్ సర్వే చేసుకోవాలి: ఏఇఓ అంబాదాస్



**?తానూర్,డిసెంబర్ 28()**
మండలం ఝరి బి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంబాదాస్ ఆధ్వర్యంలో రైతులకు డిజిటల్ క్రాప్ సర్వే, క్రాప్ బుకింగ్, ఫర్టిలైజర్ యాప్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు.?రైతులు తమ పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఇఓ తెలిపారు, దీనివల్ల ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు సులభంగా అందుతాయన్నారు, ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువుల లభ్యత తెలుసుకునే విధానాన్ని వివరించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు,ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నాగెళ్ళి రాములు కు నివాళులు అర్పించిన కాంగ్రెస్, బిజెపిపార్టీ నాయకులు



**మీడియా టుడే వలిగొండ ఆగష్టు : 28**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ కు చెందిన నాగేల్లి రాములు పార్థివ దేహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ స్థానిక సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి బిజెపి నాయకులు బంధారపు లింగస్వామి తదితరులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. రాములు గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. నాగేల్లి రాములు పార్టీప దేవానికి నివాళులు అర్పించిన వారిలో నాయకులు ఐటి పాముల రవీంద్ర సోమనబోయిన రమేష్ మైసొల్ల రామ నర్సు తదితరులు పాల్గొని ఆయన ఘనంగా నివాళులర్పించారు.

## పట్టణ అధ్యక్షులుగా తాబేటీ శ్రీనివాస్ గౌడ్



**నర్సంపేట,ఆగస్టు 28,మీడియా టుడే**

గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ పట్టణ అధ్యక్షులుగా నర్సంపేటపట్టణానికి చెందిన తాబేటి శ్రీనివాస్ గౌడ్ ను నియమించినట్లు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ తెలిపారు.శుక్రవారం నర్సంపేట లో మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం లో గీత కార్మికుల హక్కుల రక్షణ కోసం గత కొన్నేళ్లుగా శ్రీనివాస్ గౌడ్ చేస్తున్న కృషి ని చూసి పట్టణ అధ్యక్షులు గా నియమించినట్లు రమేష్ గౌడ్ తెలిపారు.శ్రీనివాస్ గౌడ్ నియమకం ఐనా నాటి నుండి రెండేళ్లు ఈ పదవిలో ఉంటాడని రమేష్ గౌడ్ వివరించారు.యాభై ఏళ్ళు నిండిన అర్హులైన గీతకార్మి కులందరికి ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలన్నారు.గౌడ కులస్తులందరు ఆర్థికంగా,సామాజికంగా,రాజకీయంగా ఎదగాలనిరమేష్ గౌడ్ పిలుపు నిచ్చారు. తనను మోకుదెబ్బ పట్టణ అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ కు,తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు గొపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్, సలహాదారులు సొల్టి సారయ్య గౌడ్,మచ్చిక రాజు గౌడ్, గోడిశాల మల్లయ్య గౌడ్, నర్సంపేట పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు కోల వెంకటేశ్వర్లు గౌడ్,ఊడ్గుల శ్రీనివాస్ గౌడ్ లకు శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలి పారు.

## మసీద్‌బండ బీజేపీ కార్యాలయంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**శేర్లింగంపల్లి మీడియా టుడే న్యూస్ ఆగస్టు 28**

మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు భిక్షపతి యాదవ్ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్ పలువురు బీజేపీ మహిళా నాయకురాళ్లు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.హఫీజ్‌పేట్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష-మహేష్ యాదవ్ , అంజయ్య నగర్ బీజేపీ నాయకురాలు ఆమని, అలాగే వివిధ డివిజన్లకు చెందిన మహిళా నాయకురాళ్లు భిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్‌లకు రాఖీలు కట్టారు సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాళవ్ మాట్లాడుతూ:"రాఖీ పండుగ అనేది అక్కాతమ్ముళ్ళు, అన్నాచెల్లెళ్ళ ప్రేమానురాగాలకు ప్రతీక. ఒకరికొకరు రక్షణగా నిలుస్తూ, సంతోషాలను పంచుకునే విశిష్టమైన పండుగ ఇది. తోడబుట్టిన బంధం మాత్రమే కాకుండా సమాజంలో సోదరభావాన్ని, రక్షణ భావాన్ని పెంపొందించడంలో రాఖీ పౌర్ణమి కీలక పాత్ర పోషిస్తుంది.అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్,దేవాల్ యాదవ్, సీతారామరాజు, జితేందర్,రాజు యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు

## రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ.

**మీడియా టుడే అచ్చంపేట (ఆగస్టు 28):**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా తన తోబుట్టువులైనఅక్కాచెల్లెళ్లు, సోదరీమణులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య రాఖీ వేడుకల్లో పాల్గొనితోడబుట్టిన వారి నుంచి ప్రేమపూర్వకంగా రాఖీలు కట్టించుకున్నారు .అక్కాచెల్లెళ్లకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా.అక్కాచెల్లెళ్ల అనుబంధం, ఆప్యాయతలు కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు.ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి (రక్షా బంధన్) శుభాకాంక్షలు తెలిపారు.

## డ్యూటీలో ఉన్న తమ్ముడికి రాఖీ

**కోదాడ, ఆగస్టు 28 (మీడియా టుడే)–:**



రాఖీ పండుగ సందర్భంగా డ్యూటీలో ఉన్న తమ్ముడికి అక్క రాఖీ కట్టి ఆప్యాయత చాటుకుంది. నడిగూడెం మండలం రామాపురానికి చెందిన మందుల గోపి ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పండుగ రోజు సెలవు లేకపోవడంతో సూర్యాపేట నుంచి కోదాడకు బస్సు నడుపుతుండగా, ఆయన అక్క స్వరూప దురాజ్‌పల్లి వద్ద బస్సును ఆపించి తమ్ముడికి రాఖీ కట్టింది. ఈ దృశ్యం ప్రయాణికులను ఆకట్టుకుంది.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

**కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు**

**వినతులు వచ్చిన వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి**

**వాట్సాప్, మెయిల్‌లో వచ్చిన ఫిర్యాదులపైనా స్పందించాలి.**

**అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం.**




**మీడియా టుడే నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (ఆగస్టు 28):**

ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా పంపినా అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. నాగర్కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తాలూకా పానగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయం, విద్యుత్ పోలీస్, దేవాదాయ, అటవీ, పౌరసరఫరాలు తదితర శాఖలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యలు, ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు.గత రెండున్నరేళ్లలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు సమర్పించిన ఫిర్యాదులు, వాటిలో పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్న వాటిపై ఆరా తీశారు.మండలానికి సంబంధించి మొత్తం 489 వినతులు అందగా, 373 వినతులపై అధికారులు చర్యలు తీసుకున్నారు. మరో 50 వినతులనుబి పరిష్కరించాల్సి ఉందని,ముఖ్యంగా నీటిపారుదల శాఖకు సంబంధించి వినతులు రాగా, 60 అర్జీలను పరిష్కరించగా19 ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే తహసీల్దార్, పాన్ గల్ పరిధిలో 99 వినతులు రాగా, 68 అర్జీలను పరిష్కరించగా, మరో 31 పరిష్కరించాల్సి ఉందనిసాంకేతికత అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిష్కరించేలా అధికారుల పనితీరులో మార్పు రావాలని మంత్రి జూపల్లి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు తమ రోజువారీ పనుల్లో నిమగ్నమై ఉంటారని, ఒక సమస్య కోసం నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను రెండు, మూడు రోజుల్లోనే జారీ చేయాలని సూచించారు.ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా పేర్కొని, చిరునామా, ఫోన్ నంబరు వివరాలతో సంబంధిత శాఖాధికారులకు వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా పంపుకోవచ్చన్నారు. వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా అధికారులు ప్రింట్ తీసుకుని సంబంధిత రికార్డుల్లో నమోదు చేసి, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు.బి

**పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి:-**

అనంతరం ఇప్పటివరకు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో మంత్రి సమీక్షించారు. పలు సమస్యలను అధికారులతో అక్కడికక్కడే పరిష్కరించారు.రెవెన్యూ సమస్యలపై ముందుగా సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారులు తమ భూ సమస్యలపై సమర్పించిన దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించి, పెండింగ్‌కు కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కూడా మంత్రి సమీక్షించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ ఆర్థిక స్థోమత లేక నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తదుపరి సమీక్ష సమావేశంలో ఆయా లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు నాలుగో విడత నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు.విద్యుత్ శాఖతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ప్రజా సమస్యలను కూడా మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా మంత్రికి అందజేశారు.

**మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్:-**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు మండల స్థాయిలోనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రజలు జిల్లా స్థాయి కార్యాలయాల వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు.ఈ సమీక్షలో అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతి, ఏడీ శ్రీనివాసులు, ఆర్డీఓ సుబ్రమణ్యం, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

**రక్తసంబంధం కాకున్నా.. ఆత్మీయతతో ఏర్పడిన అనుబంధం**

**అశోక్‌నగర్‌లో వెలుగుచూసిన అరుదైన అన్నాచెల్లెళ్ల ఆప్యాయత**





**ఖానాపురం మండలం ఏప్రిల్ 28, మీడియా టుడే . ప్రతినిధి.**

రక్షాబంధన్.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ. రక్తసంబంధంతో ఏర్పడే బంధాలకే కాకుండా.. ఆప్యాయత, ప్రేమ, మానవత్వంతో ఏర్పడే బంధాలకు కూడా రాఖీ పండుగ అద్దం పడుతుంది. కులమతాలకు అతీతంగా ఒకరినొకరు అన్నాచెల్లెళ్లుగా భావించుకుంటూ, జీవితాంతం కష్టసుఖాల్లో తోడుగా ఉంటామనే భరోసా ఇచ్చుకునే గొప్ప సంప్రదాయానికి రక్షాబంధన్ నిదర్శనంగా నిలుస్తోంది.అలాంటి అరుదైన ఆత్మీయతకు వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామం వేదికైంది. రక్తసంబంధం లేకపోయినా.. మనసులు కలిస్తే ఏర్పడే అనుబంధం ఎంత గొప్పదో చాటిచెప్పే ఘటన గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహమ్మద్ ఇబ్రహీంను సొంత తమ్ముడిగా భావించిన ఓ ఆడపడుచు రాఖీ కట్టి తన ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య చోటుచేసుకున్న ఆత్మీయ దృశ్యం పలువురిని ఆకట్టుకుంది.

**ఐదేళ్లుగా కొనసాగుతున్న ఆత్మీయ బంధం**

మహమ్మద్ ఇబ్రహీం, ఆ ఆడపడుచు మధ్య గత ఐదేళ్లుగా అన్నాచెల్లెళ్ల అనుబంధం కొనసాగుతోంది. రక్తసంబంధం లేకున్నా.. ఒకరినొకరు సొంత కుటుంబ సభ్యులుగా భావించుకుంటూప్రేమాభిమానాలను పంచుకుంటున్నారు. కష్టసమయంలో ఒకరికొకరు అండగా నిలవడం, సంతోషాన్ని పరస్పరం పంచుకోవడం ద్వారా వారి మధ్య బంధం మరింత బలపడింది.త ఏడాది అనుకోకుండా ఆమె సొంత తమ్ముడు మృతిచెందడంతో కుటుంబంలో తీరని లోటు ఏర్పడింది. తమ్ముడిని కోల్పోయిన బాధలో ఉన్న ఆమెకు ఆ లోటు ఎప్పటికీ తీరనిదే. అయితే తనను సొంత తమ్ముడిగా భావిస్తూ అండగా నిలిచిన మహమ్మద్ ఇబ్రహీంను ఆమె ఆత్మీయంగా స్వీకరించారు. రాఖీ పండుగ సందర్భంగా తన తమ్ముడి స్థానంలో ఇబ్రహీంకు రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మరింత బలపరిచారు.

**రాఖీ కట్టిన క్షణం.. భావోద్వేగం**

రాఖీ కట్టే సమయంలో అన్నాచెల్లెళ్ల మధ్య కనిపించిన ఆత్మీయత అక్కడున్న వారిని కదిలించింది. రాఖీ కట్టిన అనంతరం స్వీట్లు తినిపించుకుని ఒకరినొకరు ఆశీర్వదించుకున్నారు. రక్తసంబంధం లేకపోయినా.. మనసుతో ఏర్పడిన బంధం ఎంత పవిత్రమైనదో ఈ సందర్భంగా మరోసారి రుజువైంది.మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ.. తనను సొంత తమ్ముడిగా భావించి అక్క రాఖీ కట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత కొంతకాలంగా తమ మధ్య కొనసాగుతున్న అన్నాచెల్లెళ్ల అనుబంధం మరింత బలపడటానికి రాఖీ పండుగ వేదికగా నిలిచిందన్నారు. అక్క తనపై చూపుతున్న ప్రేమ, నమ్మకం తనకు ఎంతో విలువైనవని తెలిపారు. ఆమెకు ఎల్లప్పుడూ సొంత తమ్ముడిగా అండగా ఉంటానని, కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని చెప్పారు.రాఖీ అంటే కేవలం దారం కాదు..రాఖీ అంటే కేవలం చేతికి కట్టే దారం కాదని.. అది అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, విశ్వాసం, బాధ్యతలకు ప్రతీక అని పలువురు పేర్కొంటున్నారు. సోదరీమణులు రాఖీ కట్టి తమ సోదరుల ఆయురారోగ్యాలను కోరుకుంటే.. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇస్తారు. ఈ పరస్పర నమ్మకమే రక్షాబంధన్ పండుగకు ప్రత్యేకతను తీసుకొస్తుంది.ప్రస్తుత సమాజంలో బంధాలు, అనుబంధాలకు విలువ తగ్గుతున్న తరుణంలో ఇలాంటి ఆత్మీయతలు మానవ సంబంధాల గొప్పతనాన్ని గుర్తుచేస్తున్నాయి. రక్తసంబంధం లేకపోయినా ఒకరినొకరు కుటుంబ సభ్యులుగా భావించుకుని ఆప్యాయతను పంచుకోవడం మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది.



**కులమతాలకు అతీతంగా.. మానవత్వమే బంధంగా**

రక్షాబంధన్ పండుగ కులమతాలకు అతీతంగా జరుపుకునే పండుగ. అన్నాచెల్లెళ్ల బంధానికి కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేదని ఈ పండుగ చాటిచెబుతుంది. మనసుకు నచ్చిన వ్యక్తిని సొంత అన్నగా, చెల్లిగా భావించి ఆత్మీయతను పంచుకోవడమే అసలైన మానవత్వం.అశోక్‌నగర్‌లో జరిగిన ఈ రాఖీ వేడుక కూడా అదే సందేశాన్ని అందించింది. ఒక కుటుంబంలో పుట్టకపోయినా.. ఒకే ఇంటి రక్తం పంచుకోకపోయినా.. ప్రేమతో ఏర్పడిన అనుబంధం జీవితాంతం నిలిచిపోతుందని ఈ ఘటన నిరూపించింది. సొంత తమ్ముడిని కోల్పోయిన బాధలో ఉన్న అక్కకు ఇబ్రహీం తమ్ముడిగా అండగా నిలవడం.. ఆమె కూడా అతడిని సొంత తమ్ముడిగా భావించి రాఖీ కట్టడం వారి మధ్య ఉన్న ఆత్మీయతకు నిదర్శనంగా నిలిచింది.

**అక్కకు అండగా ఉంటాననే భరోసా**

రాఖీ కట్టిన అనంతరం మహమ్మద్ ఇబ్రహీం తన అక్కకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అక్కాచెల్లెళ్లకు రక్షణ కల్పించడం అంటే కేవలం వారిని కాపాడటం మాత్రమే కాదని.. వారి కష్టసుఖాల్లో తోడుగా ఉండటం, వారికి ధైర్యం చెప్పడం, అవసరమైన సమయంలో అండగా నిలవడమే నిజమైన సోదరత్వమని పేర్కొన్నారు.అక్కాచెల్లెళ్లను గౌరవించడం, వారి పట్ల ప్రేమతో వ్యవహరించడం, ఆపదలో ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. మహిళలకు గౌరవం, రక్షణ, భరోసా కల్పించాలనే గొప్ప సందేశాన్ని రాఖీ పండుగ సమాజానికి అందిస్తుంది.

**అనుబంధాలకు కొత్త అర్థం**

చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే బంధం జీవితాంతం కొనసాగుతుంది. అయితే కొన్ని సందర్భాల్లో రక్తసంబంధం లేకుండానే ఏర్పడే బంధాలు కూడా అంతే బలంగా ఉంటాయి. పరస్పర విశ్వాసం, ప్రేమ, ఆప్యాయత, గౌరవం ఉన్న చోటే నిజమైన బంధం ఏర్పడుతుంది. అశోక్‌నగర్‌లో జరిగిన ఈ రాఖీ వేడుక అలాంటి అనుబంధానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.సొంత తమ్ముడిని కోల్పోయిన అక్కకు ఒక తమ్ముడిగా మహమ్మద్ ఇబ్రహీం అండగా నిలవడం.. తమ్ముడిగా భావించి ఆమె రాఖీ కట్టడం.. రక్షాబంధన్ పండుగ అసలు ఉద్దేశాన్ని చాటిచెప్పింది. రక్తసంబంధం కంటే మానవత్వంతో ఏర్పడే బంధమే గొప్పదని ఈ ఘటన నిరూపించింది.అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, విశ్వాసం ఉన్నంతకాలం రాఖీ పండుగకు ఉన్న ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదు. అశోక్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ అరుదైన అనుబంధం.. రాఖీ అంటే రక్షణకు మాత్రమే కాదు.. జీవితాంతం నిలిచే ఆప్యాయతకు, మానవత్వానికి ప్రతీక అనే సందేశాన్ని అందించింది.

# అలర్జీలను తగ్గించే కొత్త ఔషధం..



అలర్జీ కారణంగా ముక్కు దిబ్బడ, తుమ్ములు, ముక్కు కారడం వంటి సమస్యలతో బాధపడేవారికి ఉపయోగపడే జనరిక్ నాసల్ స్ప్రేకు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ఎఫ్‌డీఏ) అనుమతి లభించింది. ఫ్లూటికాసోన్ ప్రొపియోనేట్ నాసల్ స్ప్రే 0.05 మిల్లీగ్రాములు/స్ప్రే మోతాదుకు ఈ ఆమోదం లభించినట్లు గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ వెల్లడించింది. రినైటిస్ చికిత్స కోసం ఉపయోగించే ఈ జనరిక్ నాసల్ స్ప్రేకు అమెరికా ఆరోగ్య నియంత్రణ సంస్థ నుంచి అనుమతి లభించడం ద్వారా గ్లెన్‌మార్క్ అమెరికా మార్కెట్లో తన శ్వాసకోశ చికిత్సల విభాగాన్ని మరింత విస్తరించే అవకాశం ఏర్పడింది. కంపెనీ నియంత్రణ సంస్థకు సమర్పించిన సమాచారంలో ఈ విషయాన్ని వెల్లడించింది. గ్లెన్‌మార్క్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఫ్లూటికాసోన్ ప్రొపియోనేట్ నాసల్ స్ప్రే అమెరికాలో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఫ్లోనేజ్ నాసల్ స్ప్రేకు బయో ఈక్వివలెంట్, థెరప్యూటికల్లీ ఈక్వివలెంట్‌గా ఉంటుంది. ఫ్లోనేజ్ నాసల్ స్ప్రేను హేలియన్ యూఎస్ హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ మార్కెట్ చేస్తోంది. కొత్త జనరిక్ ఉత్పత్తిని అమెరికాలో గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ ఇంక్., యూఎస్ఏ ద్వారా పంపిణీ చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

**ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..**

అలర్జిక్ రినైటిస్‌లో ముక్కు లోపలి భాగంలో వాపు, ముక్కు కారడం, తుమ్ములు, ముక్కు దిబ్బడ, దురద వంటి లక్షణాలు కనిపిస్తాయి. పుప్పొడి, దుమ్ము, కొన్ని అలర్జెన్లకు శరీరం అతిగా స్పందించడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ముక్కు ద్వారా ఉపయోగించే కొన్ని కార్టికోస్టెరాయిడ్ స్ప్రేలు లక్షణాలను నియంత్రించడంలో సహాయపడతాయి. అమెరికా మార్కెట్లో శ్వాసకోశ చికిత్సలకు సంబంధించిన ఉత్పత్తుల విభాగాన్ని విస్తరించడంలో ఈ ఆమోదం మరో ముందడుగు అని కంపెనీ నార్త్ అమెరికా విభాగం ప్రతినిధి తెలిపారు. ఈ రంగంలో కంపెనీ ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న పునాదిని మరింత బలోపేతం చేసేందుకు ఈ ఉత్పత్తి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన 12 నెలల కాలానికి సంబంధించిన ఐక్యూవీఐఏ విక్రయాల డేటాను ఉటంకిస్తూ కంపెనీ మరో వివరాన్ని వెల్లడించింది. అమెరికా మార్కెట్లో ఫ్లోనేజ్ నాసల్ స్ప్రే విక్రయాలు సుమారు 295.2 మిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్నాయని తెలిపింది.

**జనరిక్ అయితే..**

జనరిక్ ఔషధాలకు సాధారణంగా ఇప్పటికే ఉన్న బ్రాండ్ ఔషధాలకు సమానమైన క్రియాశీల పదార్థం, బలం, ఉపయోగం వంటి లక్షణాలు ఉంటాయి. అయితే ఒక జనరిక్ ఉత్పత్తికి నియంత్రణ సంస్థ అనుమతి లభించినంత మాత్రాన అది ప్రతి రోగికి స్వయంగా సరిపోతుందని అర్థం కాదు. ముఖ్యంగా నాసల్ స్ప్రేలను ఉపయోగించే ముందు సంబంధిత వైద్య సలహా, ఉత్పత్తి సూచనలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం. యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదంతో ఫ్లూటికాసోన్ ప్రొపియోనేట్ నాసల్ స్ప్రేను అమెరికా మార్కెట్లో జనరిక్ ఉత్పత్తిగా అందించే అవకాశం గ్లెన్‌మార్క్‌కు లభించింది. అలర్జిక్ రినైటిస్ వంటి సమస్యలకు ఉపయోగించే శ్వాసకోశ చికిత్సల విభాగంలో కంపెనీ ఉనికిని పెంచుకోవడంలో ఈ ఆమోదం కీలకంగా మారే అవకాశం ఉంది.

## క్యాన్సర్ చికిత్సకు ఎంఆర్ఎన్ఏ

# కొత్త తరహా వ్యాక్సిన్..




క్యాన్సర్ చికిత్సలో వ్యక్తిగతీకరించిన వైద్యం దిశగా మరో కీలక ముందడుగు పడింది. మోడెర్నా, మెర్క్ సంస్థలు అభివృద్ధి చేస్తున్న వ్యక్తిగతీకరించిన ఎంఆర్ఎన్ఏ క్యాన్సర్ వ్యాక్సిన్ మెలనోమా రోగులపై నిర్వహించిన ఫేజ్-3 క్లినికల్ ట్రయల్‌లో కీలక లక్ష్యాలను సాధించింది. ప్రతి రోగి కణితిలో కనిపించే ప్రత్యేక జన్యు మార్పులను గుర్తించి, వాటి ఆధారంగా ప్రత్యేకంగా రూపొందించే ఈ చికిత్స.. భవిష్యత్తులో క్యాన్సర్ చికిత్స విధానాన్ని మరింత వ్యక్తిగతీకరించే అవకాశాలను చూపిస్తోంది. తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇంటిస్మెరాన్ ఆటోజీన్, వి940 లేదా ఎంఆర్ఎన్ఏ-4157గా పిలిచే ఈ ప్రయోగాత్మక చికిత్సను పూర్తిగా శస్త్రచికిత్స ద్వారా తొలగించిన అధిక ప్రమాద మెలనోమా ఉన్న రోగులపై పరీక్షించారు. ఈ చికిత్సతో పాటు ఇప్పటికే వినియోగంలో ఉన్న పెంబ్రోలిజుమాబ్ అనే ఇమ్యూనోథెరపీని ఇవ్వగా.. పెంబ్రోలిజుమాబ్‌ను మాత్రమే తీసుకున్న వారితో పోలిస్తే క్యాన్సర్ తిరిగి వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో మెరుగైన ఫలితాలు కనిపించాయి. అలాగే క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించకుండా ఉండే వ్యవధిలోనూ ప్రయోజనం కనిపించింది.

**క్యాన్సర్ కణాలను గుర్తించి దాడి చేసేలా..**

సాధారణంగా ఇన్ఫెక్షన్లను నివారించేందుకు ఇచ్చే వ్యాక్సిన్లకు భిన్నంగా క్యాన్సర్ వ్యాక్సిన్లు చికిత్స కోసం ఉపయోగించే విధానాన్ని లక్ష్యంగా చేసుకుంటాయి. క్యాన్సర్ కణాలను గుర్తించి వాటిపై దాడి చేసేలా రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించడం వీటి ప్రధాన ఉద్దేశం. ఈ కొత్త విధానంలో ప్రతి రోగి కణితిని ప్రత్యేకంగా విశ్లేషించి, సాధారణ కణాల్లో కనిపించని క్యాన్సర్‌కు సంబంధించిన జన్యు మార్పులను గుర్తిస్తారు. కణితిలోని కొన్ని జన్యు మార్పుల వల్ల అసాధారణ ప్రొటీన్లు లేదా వాటి చిన్న భాగాలు ఏర్పడతాయి. వీటినే నియోఆంటిజెన్లు అంటారు. ఇవి ఆరోగ్యకరమైన కణాలకు, క్యాన్సర్ కణాలకు మధ్య తేడాను గుర్తించేందుకు రోగనిరోధక వ్యవస్థకు ఒక రకమైన సంకేతాలుగా పనిచేస్తాయి. వ్యక్తిగతీకరించిన నియోఆంటిజెన్ వ్యాక్సిన్ ఈ ప్రత్యేక లక్ష్యాలను గుర్తించేలా రోగనిరోధక కణాలకు శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా నిర్ణయించుకుంటుంది. ఈ చికిత్సలో మొదటి దశ రోగి కణితి నుంచే ప్రారంభమవుతుంది. మెలనోమాను శస్త్రచికిత్స ద్వారా తొలగించిన తర్వాత కణితి జన్యు సమాచారాన్ని విశ్లేషిస్తారు. క్యాన్సర్ కణాల్లో ఉండి, సాధారణ కణాల్లో లేని జన్యు మార్పులను గుర్తించి, వాటిలో రోగనిరోధక వ్యవస్థకు లక్ష్యాలుగా ఉపయోగపడే నియోఆంటిజెన్లను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ఆ రోగికి ప్రత్యేకంగా సరిపోయే ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌ను తయారు చేస్తారు.

**రోగ నిరోధక వ్యవస్థకు నేర్చుకునే శక్తి..**

శరీరంలోకి ఇచ్చిన తర్వాత ఎంఆర్ఎన్ఏ కణాలకు కొన్ని నిర్దిష్ట యాంటిజెన్లను తయారు చేయడానికి అవసరమైన సూచనలను అందిస్తుంది. దీంతో రోగనిరోధక వ్యవస్థ ఆ లక్ష్యాలను గుర్తించడం నేర్చుకుని, వాటిపై దాడి చేసే టీ-కణాల ప్రతిస్పందనను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ విధంగా క్యాన్సర్ కణాలను ప్రత్యేకంగా గుర్తించే రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపించడమే వ్యాక్సిన్ ఉద్దేశం. ఈ వ్యాక్సిన్‌ను పెంబ్రోలిజుమాబ్‌తో కలిపి ఉపయోగిస్తున్నారు. పెంబ్రోలిజుమాబ్ ఒక పీడీ-1 ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్హిబిటర్. రోగనిరోధక కణాలు క్యాన్సర్‌పై దాడి చేయకుండా అడ్డుకునే ఒక రకమైన బ్రేక్ ను తొలగించడంలో ఇది సహాయపడుతుంది. అందువల్ల ఈ రెండు చికిత్సలు భిన్నమైన మార్గాల్లో పనిచేస్తాయి. వ్యాక్సిన్ రోగనిరోధక వ్యవస్థకు ఏ క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకోవాలో నేర్పిస్తే.. పెంబ్రోలిజు మాబ్ వాటిపై దాడి చేయడాన్ని అడ్డుకునే రోగనిరోధక వ్యవస్థ బ్రేక్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. ఫేజ్-3 ఇంటర్‌పాత్-001 ట్రయల్‌లో పూర్తిగా శస్త్రచికిత్స ద్వారా తొలగించిన స్టేజ్ 2బి నుంచి 4 వరకు ఉన్న మెలనోమా రోగులు 1,137 మంది పాల్గొన్నారు. వీరిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూప్‌కు ఇంటిస్మెరాన్ ఆటోజీన్‌తో పాటు పెంబ్రోలిజు మాబ్ ఇవ్వగా.. మరో గ్రూప్‌కు పెంబ్రోలిజుమాబ్‌ను మాత్రమే అందించారు.

**శరీరంలో వ్యాప్తి చెందకుండా..**

ఈ అధ్యయనంలో వ్యాక్సిన్-పెంబ్రోలిజుమాబ్ కలయిక రీకరెన్స్-ఫ్రీ సర్వైవల్ అంటే క్యాన్సర్ తిరిగి కనిపించకుండా ఉండే వ్యవధికి సంబంధించిన ప్రధాన లక్ష్యాన్ని సాధించింది. అలాగే డిస్టెంట్ మెటాస్టాసిస్-ఫ్రీ సర్వైవల్ అంటే క్యాన్సర్ శరీరంలోని దూర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండే వ్యవధికి సంబంధించిన కీలక ద్వితీయ లక్ష్యాన్ని కూడా సాధించింది. పెంబ్రోలిజుమాబ్‌ను మాత్రమే తీసుకున్న వారితో పోలిస్తే ఈ రెండు అంశాల్లోనూ గణాంకపరంగా ముఖ్యమైన, వైద్యపరంగా ఉపయోగకరమైన మెరుగుదల కనిపించినట్లు సంస్థలు వెల్లడించాయి. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి ఫేజ్-3 ట్రయల్‌కు సంబంధించిన ప్రాథమిక ఫలితాలు మాత్రమే. మొత్తం డేటా ఇంకా పూర్తిగా వెల్లడించలేదు. ముఖ్యంగా రోగులు ఎంతకాలం జీవించారు అనే ఓవరాల్ సర్వైవల్ సహా మరికొన్ని ఫలితాలపై ఇంకా ఫాలో-అప్ కొనసాగుతోంది. పూర్తి వివరాలను భవిష్యత్తులో జరిగే వైద్య సదస్సులో వెల్లడించనున్నట్లు సంస్థలు తెలిపాయి. అందువల్ల ఫేజ్-3 ట్రయల్ విజయవంతమైందన్న విషయం ముఖ్యమైన ముందడుగు అయినప్పటికీ.. వ్యాక్సిన్ వెంటనే అందుబాటులోకి వస్తుందని మాత్రం అర్థం కాదు.

**కీలక ముందడుగు..**

మోడెర్నా-మెర్క్ వ్యక్తిగతీకరించిన మెలనోమా వ్యాక్సిన్ క్యాన్సర్ చికిత్సలో ఒక ఆసక్తికరమైన పరిణామంగా నిలుస్తోంది. దీని ప్రత్యేకత కేవలం ఎంఆర్ఎన్ఏ సాంకేతికతను ఉపయోగించడంలోనే లేదు. రోగి సొంత కణితిలోని జన్యు మార్పులను గుర్తించి, వాటి ఆధారంగా రోగనిరోధక వ్యవస్థకు ప్రత్యేకమైన లక్ష్యాలను అందించడంలో ఉంది. ఫేజ్-3 ఇంటర్‌పాత్-001 ట్రయల్ ఫలితాలు శస్త్రచికిత్స తర్వాత క్యాన్సర్ తిరిగి రావకుండా, ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండే వ్యవధిని పెంచడంలో ఈ వ్యక్తిగతీకరించిన విధానం ఉపయోగపడే అవకాశాన్ని సూచిస్తున్నాయి. అయితే దీన్ని ఇప్పుడే అన్ని రకాల క్యాన్సర్లకు పనిచేసే క్యాన్సర్ వ్యాక్సిన్ గా పిలవడం తొందరపాటు అవుతుంది. పూర్తి ఫేజ్-3 డేటా, దీర్ఘకాలిక ఫలితాలు, ముఖ్యంగా ఓవరాల్ సర్వైవల్, నియంత్రణ సంస్థల ఆమోదం, ఇతర క్యాన్సర్లలో వచ్చే ఫలితాలే ఈ సాంకేతికత భవిష్యత్తులో ఎంతటి మార్పును తీసుకురాగలదో నిర్ణయించనున్నాయి. ప్రస్తుతం మాత్రం వ్యక్తిగతీకరించిన నియోఆంటిజెన్ క్యాన్సర్ వ్యాక్సిన్ పరిశోధన దశ నుంచి నిజమైన క్యాన్సర్ చికిత్సగా మారే దిశలో మరో ముఖ్యమైన అడుగు ముందుకు పడిందని చెప్పవచ్చు.

### వ్యాధులను వ్యాప్తి చేసే దోమలు ఎన్ని రకాలు,

# రక్షణకు ఏం చేయాలి..?



ఇంట్లో లేదా పరిసరాల్లో దోమ కనిపిస్తే అది సాధారణ దోమగానే అనిపిస్తుంది. కానీ అన్ని దోమలు ఒకే రకమైన వ్యాధులను వ్యాప్తి చేయవు. కొన్ని దోమలు డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వైరల్ వ్యాధులకు కారణమవుతుండగా.. మరికొన్ని మలేరియా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వంటి వ్యాధులను వ్యాప్తి చేస్తాయి. దోమలు ఎప్పుడు కుడతాయి, ఎక్కడ పెరుగుతాయి, వాటి నుంచి మనల్ని మనం ఎలా రక్షించుకోవాలో తెలుసుకోవడం ద్వారా దోమల వల్ల వచ్చే వ్యాధుల ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చు. ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 1897లో దోమలే మలేరియాను వ్యాప్తి చేస్తాయని నిరూపించిన బ్రిటిష్ వైద్యుడి పరిశోధనను గుర్తుచేసుకునేందుకు ఈ రోజును పాటిస్తారు. ఆ పరిశోధన మలేరియాపై అవగాహనను మార్చడమే కాకుండా.. దోమలు వ్యాధులను వ్యాప్తి చేసే ప్రధాన వాహకాలుగా ఎలా పనిచేస్తాయో అర్థం చేసుకోవడానికి దోహదపడింది. ప్రపంచవ్యాప్తంగా 3,500కు పైగా దోమల జాతులను గుర్తించారు. అయితే వీటిలో కొద్ది జాతులు మాత్రమే మనుషుల్లో వ్యాధులకు కారణమయ్యే వైరస్‌లు, పరాన్నజీవులు లేదా ఇతర వ్యాధికారకాలను వ్యాప్తి చేస్తాయి. భారత్‌లో ప్రజారోగ్య పరంగా ముఖ్యంగా మూడు రకాల దోమల సమూహాలు కీలకంగా ఉన్నాయి. అవి ఏడిస్, అనోఫిలిస్, క్యూలెక్స్. ఇవి వ్యాప్తి చేసే వ్యాధులతోపాటు.. పెరిగే ప్రదేశాలు, మనుషులను కుట్టే సమయాల్లో కూడా తేడాలు ఉంటాయి.

**ఏడిస్ ఈజిప్టై దోమలు..**

భారత్‌లోని నగర ప్రాంతాల్లో డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల వ్యాప్తిలో ఏడిస్ ఈజిప్టై దోమలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ దోమలు ఎల్లో ఫీవర్, జికా వంటి వ్యాధులను కూడా వ్యాప్తి చేస్తున్నాయి. మనుషులు నివసించే ప్రాంతాల్లో సులభంగా జీవించగలగడం ఏడిస్ దోమలను నియంత్రించడం కష్టతరం చేస్తుంది. ఈ దోమలు పెద్ద మొత్తంలో నీరు అవసరం లేకుండానే చిన్నచిన్న నీటి నిల్వల్లో గుడ్లు పెడతాయి. ఇంటి చుట్టుపక్కల ఉన్న పాత టైర్లు, పూల కుండీలు, కూలర్లు, బకెట్లు, ఇతర నీరు నిల్వ ఉండే వస్తువుల్లో కూడా ఇవి పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం ఏడిస్ దోమల నియంత్రణలో ముఖ్యమైన చర్యగా చెబుతారు. ఏడిస్ దోమలకు మరో ప్రత్యేకత ఉంది. ఇవి ప్రధానంగా పగటి సమయంలో మనుషులను కుడతాయి. ముఖ్యంగా ఉదయం వేళల్లో, సూర్యాస్తమయం ముందు వీటి కాటు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అందువల్ల దోమల నుంచి రక్షణ అంటే కేవలం రాత్రి పడుకునే సమయంలో తీసుకునే జాగ్రత్తలకు మాత్రమే పరిమితం కాకూడదు. పగటి సమయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**ఆడ అనోఫిలిస్ దోమ..**

డెంగ్యూ ప్రపంచవ్యాప్తంగా ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 10 కోట్ల నుంచి 40 కోట్ల వరకు డెంగ్యూ ఇన్ఫెక్షన్లు సంభవించే అవకాశం ఉంది. అయితే వీటిలో చాలా ఇన్ఫెక్షన్లు స్వల్ప లక్షణాలతో లేదా ఎలాంటి లక్షణాలు లేకుండానే ఉంటాయి. మలేరియాతో సంబంధం ఉన్న ప్రధాన దోమల సమూహం అనోఫిలిస్. డెంగ్యూ, చికున్‌గున్యా వైరస్‌ల వల్ల వస్తే.. మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వల్ల వస్తుంది. మలేరియా సోకిన ఆడ అనోఫిలిస్ దోమ మనిషిని కుట్టినప్పుడు ఈ పరాన్నజీవి రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తుంది. మలేరియా ఉన్న వ్యక్తిని కుట్టినప్పుడు దోమలోకి కూడా పరాన్నజీవి చేరుతుంది. అనంతరం ఆ పరాన్నజీవి దోమలో అభివృద్ధి చెంది.. అదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు వ్యక్తులకు వ్యాపిస్తుంది. భారత్‌లో మలేరియాను వ్యాప్తి చేయగలిగే అనోఫిలిస్ జాతులు అనేకం ఉన్నాయి. వాటిలో అనోఫిలిస్ స్టీఫెన్సీ ముఖ్యమైనది. ఇది పట్టణ ప్రాంతాలకు కూడా అనుకూలంగా ఉంటుందని, నగరాల్లో మలేరియా వ్యాప్తితో సంబంధం ఉంటుందని గుర్తించారు.

**క్యూలెక్స్ దోమలు..**

అనోఫిలిస్ దోమలు సాధారణంగా సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎక్కువగా కుడతాయి. అందువల్ల మలేరియా వ్యాప్తి ఉన్న ప్రాంతాల్లో రాత్రి సమయంలో దోమతెరలను ఉపయోగించడం వంటి రక్షణ చర్యలకు ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా పురుగుమందుతో శుద్ధి చేసిన దోమతెరలు, ఇంటి లోపల పురుగుమందు పిచికారీ వంటి చర్యలు మలేరియా నియంత్రణలో ఉపయోగపడే ముఖ్యమైన మార్గాలుగా ఉన్నాయి. భారత్‌లో మరో ముఖ్యమైన దోమల సమూహం క్యూలెక్స్. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వ్యాప్తిలో క్యూలెక్స్ దోమలు కీలక పాత్ర పోషిస్తాయి. జపనీస్ ఎన్‌సెఫలైటిస్‌ను కలిగించే వైరస్ మెదడుపై ప్రభావం చూపిస్తుంది. ఈ వైరస్ సోకిన వారిలో చాలా మందికి ఎలాంటి లక్షణాలు కనిపించవు. అయితే కొద్దిమందిలో తీవ్రమైన వ్యాధి, ముఖ్యంగా మెదడు వాపు వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల శాశ్వత నాడీ సంబంధిత సమస్యలు లేదా మరణం సంభవించే ప్రమాదం కూడా ఉంటుంది. క్యూలెక్స్ దోమలు లింఫాటిక్ ఫైలేరియాసిస్ వ్యాప్తిలోనూ కీలకపాత్ర పోషిస్తాయి. ఇది పరాన్నజీవి వల్ల వచ్చే ఇన్ఫెక్షన్. దీర్ఘకాలంలో శరీరంలోని కొన్ని భాగాల్లో తీవ్రమైన వాపు, వైకల్యం వంటి సమస్యలకు దారితీస్తుంది. క్యూలెక్స్ దోమలు సాధారణంగా సాయంత్రం, రాత్రి సమయంలో ఎక్కువగా చురుకుగా ఉంటాయి.

**అన్ని దోమలకు వ్యాధులు రావు..**

అయితే ఒక దోమ అంటే ఒకే వ్యాధి అని కచ్చితంగా చెప్పలేం. ఏడిస్ అంటే డెంగ్యూ, అనోఫిలిస్ అంటే మలేరియా, క్యూలెక్స్ అంటే జపనీస్ ఎన్‌సెఫలైటిస్ అని సరళంగా విభజించడం సరైనది కాదు. ఒకే దోమల సమూహంలో అనేక జాతులు ఉంటాయి.

Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103